RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



14 జనవరి 2025 మంగళవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:192

## పెట్టుబడులకు గమ్య స్థానంగా

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



పెట్టుబడులకు గమ్య స్థానంగా ఇప్పటికే తెలంగాణ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. దేశ విదేశాల్లో పేరొందిన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలో అనుకూలమైన వాతావరణముందని అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ సిటీగా వెలుగొందుతున్న హైదరాబాద్ సిటీలో ఉన్న సానుకూలతలను ప్రపంచ వేదికపై పరిచయం చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం అందరినీ ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ది పనులన్నీ తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టాయని అన్నారు.

జూబ్లీహిల్స్ లోని నివాసంలో పరిశ్రమల శాఖపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.జనవరి 20 నుంచి దావోస్ పర్యటన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడుల సమీకరణ, వాటి పురోగతి ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు.



గత ఏడాది ప్రభుత్వం తో ఒప్పందం చేసుకున్న ఏయే కంపెనీ లు రాష్ట్రంలో కార్యకలాపాలను ప్రారంభించాయి.. అవి ఏయే దశలో ఉన్నాయని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు.తొలి ఏడాదిలో రాష్ట్రానికి భారిగా పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది దావోస్ లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో చేసుకున్న ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.40232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 14 ప్రముఖ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడుల కు ముందుకు వచ్చాయి. దాదాపు 18 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయి. వీటిలో దాదాపు 17 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. పది ప్రాజెక్టులు వివిధ దశల్లో వేగం పుంజుకున్నాయని, ఏడు ప్రాజెక్టుల అమలు ప్రారంభ దశలో ఉందని తెలిపారు. కంపెనీల వారిగా పురోగతిని మంత్రి శ్రీధర్ బాబు తో సీఎం చర్చించారు.

ఈ నెల 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు ముఖ్యమంత్రి దావోస్ లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటన లో ఉంటారు. సింగపూర్ లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలతో పాటు ఇతర పెట్టుబడులకు సంబంధించి సంప్రదింపులు జరుపుతారు. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు.ఈ ఆరు రోజుల పర్యటనకు సంబంధించిన షెడ్యూలుతో పాటు, అక్కడ జరిగే సదస్సులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశాల ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు.


## తెలంగాణ ప్రభుత్వానికి సింగరేణి రూ.88.55 కోట్ల డివిడెండ్ చెల్లింపు

### -ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి చెక్కును అందజేసిన సీఎండీ ఎన్.బలరామ్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 13 :** ఈ ఏడాది 2025 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కాలరీస్ సంస్థ 88,55,99,147 రూపాయల డివిడెండ్‌ను చెల్లించింది. ఈ మేరకు డివిడెండ్ చెక్కును సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకి అందజేశారు. సింగరేణి కాలరీస్ చెల్లింపు మూల ధనం(పెయిడ్ అప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్ ) లో 10 శాతాన్ని డివిడెంట్‌గా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తం సుమారు రూ.173 కోట్లు కాగా.. సింగరేణిలో 51 శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వానికి ఇందులో నుంచి 88.55 కోట్ల రూపాయలను డివిడెండ్‌గా చెల్లించారు. సింగరేణి సంస్థ దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలు తీర్చుతూ లాభాలను ఆర్జిస్తూ కార్మికులకు లాభాల వాటా చెల్లించడమే కాకుండాప్రతీ ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి డివిడెండ్‌లు చెల్లించడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు లు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు ,ప్రకటనదారులకు ,శ్రేయోభిలాషులకు మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు.




**14.01.2025 నాడు కార్యాలయానికి సెలవు ప్రకటించడం జరిగినది.**

## రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

### - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికి సంక్రాంతి పండగ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి, సంక్రాంతి,కనుమ పండుగలను ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో, కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మన దగ్గర ఉన్నదాన్ని నలుగురితో పంచుకోవడమే అసలైన సంక్రాంతి పండగ పరమార్ధమని గుర్తు చేసిన మంత్రి. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమం, సుపరిపాలన ప్రగతిపథంలో ముందుకు సాగుతున్న తరుణంలో.. ప్రజలంతా స్వేచ్ఛా సౌభాగ్యాలతో సంబురంగా సంక్రాంతిని జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ సంక్రాంతి పండగ తెలంగాణ బిడ్డల జీవితాల్లో కొత్త వెలుగులను ప్రసాదించాలని ఆకాంక్షించిన మంత్రి. ప్రజాస్వామ్యబద్ధంగా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాప్రభుత్వానికి దేవుడి ఆశీస్సులు సంపూర్ణంగా ఉండాలని కోరుకుంటున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.



**జూబ్లీహీల్స్ ప్రజాబలం ప్రతినిధి:** దివంగత మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## నిజామాబాద్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు




నిజాంబాద్ సీఎం రేవంత్ రెడ్డి మూలాలు ఆర్ఎస్ఎస్ లో ఉన్నాయి అందుకే మైనారిటీల పట్ల ముఖ్యమంత్రి వివక్ష చూపుతున్నట్లున్నారు. గాంధీల కుటుంబాన్ని చూసి మైనారిటీలు కాంగ్రెస్ కు ఓట్లు వేశారు

కానీ ఇప్పుడు మైనారిటీల నమ్మకాన్ని వమ్ము చేస్తున్న కాంగ్రెస్,కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక్క మతకల్లోలం కూడా జరగలేదకాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక మతకల్లోలాలు జరిగాయి మతకల్లోలాలను నిరోధించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు,గంగాజమునా తెహజీబ్ లా ఉన్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నారుమైనారిటీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించింది.మైనారిటీ డిక్లరేషన్ అమలు ఏమైంది,మైనారిటీ డిక్లరేషన్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్ లో కనీసం 25 శాతం కూడా ఖర్చు చేయలేదు.3000 వేల కోట్లు కేటాయించి కేవలం 700 కోట్లుమాత్రమే ఖర్చు చేశారు.షాదీ ముబారక్ కింద 1.6 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి నిజామాబాద్ లో తబ్లిఖీ జమాత్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అన్ని ఏర్పాట్లు చేయాలి.బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాము

# ప్రజాబలం

14 జనవరి 2025 మంగళవారం


## మనం గుర్తించని మహా శాస్త్రవేత్త

ఆయన మానవ శరీరంలో విటమిన్ బి నిర్వహిస్తున్న అత్యంత కీలకమైన పాత్రను కనుగొన్నాడు. దాన్ని గుర్తించడమే కాదు, వెలికితీసి కృత్రిమంగా తయారు చేయడానికి మార్గం సుగమం చేశాడు. విటమిన్ బి ని ప్రజారోగ్యం కోసం ఇప్పటికీ ప్రపంచం ఉపయోగిస్తోంది. ఆయన పరిశోధన విటమిన్-12 తయారీకి దారితీసింది. దాన్ని కూడా నేడు ప్రపంచ వ్యాపితంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఆయన ఈ రోజు క్యాన్సర్ చికిత్సలో ముఖ్యంగా పిల్లల్లో వచ్చే ల్యుకేమియా చికిత్సలో కీలకమైన మెథోట్రెగ్జేట్ ఔషధాన్ని రూపొందించాడు. ఆయన ఉష్ణ మండలాల్లో దోమకాటు వల్ల వచ్చే బోదకాలు వ్యాధిని నయం చేసే మందు డిఇథైల్‌కార్బమజైన్‌ను కనుగొన్నాడు. ప్రపంచ వ్యాపితంగా బోదకాలు వ్యాధి నివారణలో ఇది అమోఘంగా పనిచేసింది. అన్నిటికీ మించి యాంటీబయాటిక్స్ తయారీలో ఆయన కృషి నేటికీ ఏనాటికీ ప్రపంచం ఆయనకు రుణపడి ఉంటుంది. విభిన్న రకాల బ్యాక్టీరియా వ్యాధులను నయం చేసే మందుల్లో ఉపయోగించే టెట్రాసైక్లిన్ అభివృద్ధిలో కీలక పాత్ర నిర్వహించాడు. ఇంత గొప్ప పరిశోధనలు చేసి మానవాళి ఆరోగ్యానికి మహోపకారం చేసిన ఆ వ్యక్తి డా.ఎ.యల్లాప్రగడ సుబ్బారావు మన ఆంధ్రుడనీ, భీమవరంలో పుట్టి ప్రాథమిక చదువులు చదివి, మద్రాసులో ఉన్నత విద్యనభ్యసించి, అమెరికా వెళ్లి గొప్ప పరిశోధనలు చేసి ప్రపంచ ప్రజలకు కలకాలం ఉపయోగపడే పరమౌషధాలు తయారీకి తోడ్పడ్డాడనీ చాలా తక్కువ మందికే తెలుసు. నిజానికి యల్లాప్రగడ సుబ్బారావు చేసిన పరిశోధనలు, ఆయన కనుగొన్న ఆవిష్కరణలకన్నా తక్కువ చేసిన వారికి నోబెల్ బహుమతులు లభించాయి. ఆయన కన్నా తక్కువ కృషి చేసిన వారికి మన దేశంలో మరణానంతర భారత రత్న బిరుదులు లభించాయి. కానీ సుబ్బారావు పరిశోధనా ఫలితాలు నేటికీ అనుభవిస్తున్న ప్రపంచం గానీ, ఆయన భారతీయుడై పుట్టినందుకు మన దేశం గానీ ఆయనకు తగిన గుర్తింపు నివ్వలేదు. కారణం ఏమై ఉండొచ్చు? బహుశా యల్లాప్రగడ సుబ్బారావు భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త గనుక వందేళ్ల క్రితం పశ్చిమ దేశాల్లో నెలకొన్ని ఉన్న వివక్ష ఆయనకు నోబెల్ బహుమతిని దూరం చేసి ఉండవచ్చు, ఆయన భారత్‌లో పుట్టినా అమెరికాలో పరిశోధనలు చేశారు కాబట్టి మన దేశం ఆయనను విస్మరించి ఉండవచ్చు. కానీ ప్రపంచ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడ్డంలో చేసిన పరిశోధనలు, ఆవిష్కరణలకుగాను ఆయన సర్వ మానవాళికీ ప్రాత:స్మరణీయుడుగా నిలిచిపోతాడు.

ఈ రోజు యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి. ఆయన భీమవరం పట్టణంలో 1895 జనవరి 12వ తేదీన జన్మించి 1948 ఆగస్టు 8న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 53వ ఏట కన్నుమూశారు. కేవలం 53 ఏళ్ల లోనే ఆయన అన్ని విజయాలు సాధించారంటే ఇంకా నిండు జీవితం గడిపి ఉంటే ఇంకా ఎన్ని గొప్ప ఆవిష్కరణలు చేసేవాడో కదా! సుబ్బారావు తండ్రి పేరు జగన్నాథం. చిరు ఉద్యోగిగా రిటైర్ అయ్యాడు. దాంతో సుబ్బారావు తల్లి పట్టుబట్టి రాజమండ్రికి పంపించి మెట్రిక్యులేషన్ చదివించింది. ఫెయిలయ్యాడు. ఇంతలో తండ్రి మరణించాడు. తల్లి పట్టుదలతో కొడుకు చదువు కోసం పుస్తెలు అమ్మి మద్రాసుకు పంపించింది. మద్రాసు హిందూ ఉన్నత పాఠశాలలో చేరి, చదువులో ముందడుగు వేశాడు. మద్రాసు ఇండియన్ మెడికల్ కాలేజీలో ఎల్.ఐ.ఎం చేసి, కార్పొరేషన్ ఆయుర్వేద హాస్పటల్‌లో నెలకు అరవై రూపాయల జీతం మీద పని చేశాడు. విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేయాలని వైద్య శాస్త్రాన్ని శోధించి, పరిశోధించి అనేక రహస్యాలను వెలికి తీయాలనే దృఢమైన కాంక్షతో అమెరికా వెళ్లి హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో చేరి పరిశోధనలు చేపట్టాడు. ఆయన భార్య పేరు శేషగిరి. మామ కస్తూరి సూర్యనారాయణ మూర్తి, సుబ్బారావు ఉన్నత చదువులకు ఆర్థికంగా సహకరించారు.

హార్వర్డ్‌లో యల్లాప్రగడ సుబ్బారావు ఆవిష్కరణల పరంపర 1925లో ప్రారంభమైంది. సైరస్ ఫిస్కే అనే శాస్త్రవేత్తతో కలిసి ఆయన మానవ శరీరంలోని ద్రవంలో భాస్వరం ఎంత ఉందో కనుగొనే పద్ధతిని కనిపెట్టాడు. దీన్ని అప్పటి నుండి ఫిస్కే-సుబ్బారావు పద్ధతిగా పేర్కొంటున్నారు. తరువాత 1927లో ఫాస్ఫోక్రియాటైన్, 1929లో అడినోసిన్ ట్రైఫాస్ఫేట్ (ఎటిపి)లను ఆయన కనుగొన్నాడు. 1930లో ఆయన హార్వర్డ్ నుండి పిహెచ్‌డి పొందాడు. 1940 వరకు హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో టీచింగ్ ఫెలోగా పనిచేశారు. తరువాత లెడెర్లె లాబరేటరీలో రిసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్‌గా చేరి, 1942లో దాని డైరెక్టర్ అయ్యారు. ఈ కాలంలో ఆయన వైద్య రంగానికి సంబంధించిన నాలుగు అతి ముఖ్యమైన పదార్థాలను కనుగొన్నాడు. వాటిలో మొదటిది, టెట్రాసైక్లిన్ యాంటీ బయోటిక్స్‌లో మొదటిదైన ఆరియోమైసిన్. తరువాత 1947లో బోదకాలు నయం చేసే హెట్రాజన్ (డైథీలెర్బామాజైన్ సిట్రేట్) కనుగొన్నాడు. 65 ఏళ్ల తరువాత ఇప్పటికీ ఈ మందును వాడుతున్నారు. తరువాత ఆయన కనుగొన్న మూడోది, విటమిన్-బి (ఫోలిక్ యాసిడ్). తరువాత ఆయన పరిశోధనలు విటమిన్-బి కనుగొనే వరకు వచ్చాయి. కానీ వాస్తవంగా ఆయన పరిశోధనలపై ఆధారపడి తరువాత దాన్ని కనుగొన్నారు. నాల్గవది, శరీర కణాల పెరుగుదలను నిలువరించి క్యాన్సర్‌ను నయం చేయగల అమినోప్టెరిన్‌ను ఆయన కనుగొన్నాడు. యల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్న ఈ మందులన్నీ దశాబ్దాలు గడిచిపోయినా నేటికీ ఉపయోగంలో ఉన్నాయంటే ఆయన ఆవిష్కరణల విశిష్టత అర్థమవుతుంది. ఇవే కాకుండా ఆయన కనుగొన్న విషయాలు చాలా ఉన్నాయి. మానవాళికి ఉపయోగపడే ఇంత గొప్ప పరిశోధనలు చేసిన సుబ్బారావు అవి ప్రజలకు ఉపయోగ పడాలనుకున్నాడే గాని వాటికి పేటెంట్లు ఆశించలేదు. అలా ఆశించి ఉంటే ఆయన శతకోటీశ్వరుడై ఉండవాడు. అలాగే ఆయన ఎటువంటి గుర్తింపును కూడా ఆశించలేదు. నిజానికి గుర్తింపు కోసం తాపత్రయపడడం ఆయన నైజం కాదు. ''ఈ శతాబ్దానికి చెందిన ఒక గొప్ప వైద్య ఆలోచనాపరుడు'' అని సుబ్బారావు చనిపోయినప్పుడు ఆయన నుద్దేశించి హెరాల్డ్ ట్రిబ్యూన్ వ్యాఖ్యానించింది. వైద్య రంగంలో యల్లాప్రగడ సుబ్బారావు స్ఫూర్తి మంతమైన కృషినీ, విజయాలనూ నేటి తరం యువతకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నరువి ఆసుపత్రిలో సంక్రాంతి సంబరాలు

### తిరుపతి జిల్లాసాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ జీవి సంపత్



వేలూరు వేలూరులోని నరువి ఆసుపత్రిలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు. కుల మతాలకు అతీతంగా పురుషులు, మహిళలు వయో పరిమితి తేడాలు లేకుండా పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు.'సమైక్యత, సమానత' లకు మారుపేరైన సంక్రాంతి పండుగతో పాటు, పంటల కాలం కావడంతో రైతులకు అభినందనల కార్యక్రమాలను వేలూరులోని నరువి ఆసుపత్రిలో సోమవారం (13.01.2024) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను నరువి ఆసుపత్రి ఛైర్మెన్, అనితా సంపత్ వైస్ ఛైర్ పర్సన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా మట్టి కుండలతో పొంగల్ తయారు చేయడంతో పాటు సంగీత, జానపద క్రీడలను నిర్వహించారు. ఇందులో సిలంబాట్టం (సంప్రదాయమైన కర్రసాము), ఉయిరిడత్తల్ (సంప్రదాయ డప్పులను వాయించడం), రోప్ క్రీడలు, చెరకు ముక్కల పంపిణీ లాంటివి తమిళనాడులోని ఇళ్లలో సమగ్రంగా జరుపుకునే పండుగను నిర్వహించారు. డాక్టర్లు, నర్సులు ఉత్సాహంగా పాల్గొన్న క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసిన డాక్టర్ సంపత్ మాట్లాడుతూ తమిళ ప్రజలు సంక్రాంతి అత్యంత ప్రధానమైన పండుగగా జరుపుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ పండుగ ప్రజలను కుల మతాలకు అతీతంగా సమైక్యత చేస్తుందని, ఈ సందర్భంగా అందరికి తన హృదయ పూర్వక శుభాకాంక్షలను వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ కుటుంబాలను కలుపుతుందని, అనేక మంది తమ స్వగ్రామాలకు చేరుకుని, సమయాన్ని గడిపే పండుగని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ జాకబ్ పాల్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, అభిరామి సంపత్ పాల్గొన్నారు.

## నారావారిపల్లి లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



### లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ

### పాల్గోన్నల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

తిరుపతి, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం ద్వారా నారావారి పల్లి లోని ఇద్దరు రైతులకు డ్రిప్ పరికరాలను బలరాం నాయుడు,జ్యోతి లకు అందచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. అధికారులకు సూచిస్తూ ఏపీఎంఐపి ప్రాజెక్టు కింద అర్హులైన అందరిని కవర్ చేయాలని సూచించారు. ఇక్కడ జిల్లా ఏపీఎంఐపి అధికారి సతీష్ ఉన్నారు.-నారావారి పల్లె నందు సుమారు రూ. 4.27 కోట్లతో నిర్మించనున్న 33/కెవి సెమీ ఇండోర్ సబ్ స్టేషన్ కు శిలాఫలకం ఆవిష్కరించి శంఖు స్థాపన చేసిన ముఖ్యమంత్రి. ఇక్కడ సిఎండి ఏపీఎస్పీడీసీఎల్ సంతోష్ రావు ఉన్నారు. ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటుతో కవర్ చేయాలని తెలుపుతూ, అధికారులకు పలు సూచనలు చేశారు.-జాతీయ ఉపాధి హామీ పథకం కింద నారావారి పల్లి గ్రామ పరిధిలోని మూడు సచివాలయల పరిధిలో 26 అభివృద్ధి పనులు రూ. 3.21 కోట్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరించి శంఖు స్థాపన చేసిన ముఖ్యమంత్రి. ఇక్కడ పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్ ఉన్నారు.

గ్రామ పంచాయతీ పరిధిలోని 8 అంగన్వాడి కేంద్రాలలోని అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాన్ని కేర్ అండ్ గ్రో సామాజిక చైతన్య ప్రతినిధుల ద్వారా తిరుపతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అమలు కొరకు ముఖ్యమంత్రి సమక్షంలో ఎంఓయు ల మార్పిడి జరిగింది.

ముఖ్యమంత్రి మాట్లాడుతూఐదేళ్ల లోపు పిల్లలకు మంచి భవిష్యత్తును అందించడానికి ఒక ప్రాజెక్టుకు ఏంఓయు ను సంతకం చేశారనీ తెలుపుతూ సదరు కేర్ అండ్ గ్రో ద్వారా కుప్పం నందు 480 సెంటర్లలో అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లల మానసిక, శారీరక, విద్యా పరమైన అంశాలలో మెరుగ్గా ఫలితాలు వచ్చేలా చేపట్టిన చర్యలు,తల్లులతో సమావేశాలు నిర్వహించి వారికి అవగాహన కల్పించే ఈ కార్యక్రమం కుప్పంలో మంచి ఫలితాలు ఇస్తోందని, ఇక్కడ కూడా మంచి ఫలితాలు రావాలని అన్నారు. ఇక్కడ జిల్లా మహిళ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని జయలక్ష్మి, కేర్ అండ్ గ్రో ఫౌండర్ డా. మేఘన ఉన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలో చేరిన ఆలమూరు గ్రామ రైతులు.

### ఆళ్లగడ్డ రాజకీయాల కతీతంగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడండి.



ఆళ్లగడ్డ: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం , ఎఐకెఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న పోరాట కార్యక్రమాలకు ఆకర్షితులైన రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి చెందిన రైతులు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు, రుద్రవరం మండల నాయకులు జి. శంకర్ ఆధ్వర్యంలో రైతు సంఘం లో చేరారు. సోమవారం ఆళ్లగడ్డలో జరిగిన సంఘంముఖ్య కార్యకర్తల సమావేశంలో రమేష్ కుమార్, రామచంద్రుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయి, అప్పుల బాధతో, ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పండించిన పంటలకు మద్దతు ధరల కోసం రైతాంగం ఆందోళనలు చేస్తే బలవంతంగా పోలీస్ ల ద్వారా అణిచివేస్తున్నారన్నారు. దేశ ప్రజలందరికీ అన్నం పెట్టే అన్నదాతలను ఆదుకునేందుకు వారి పంట రుణాలు రద్దు చేయమని కోరితే వారిపై తప్పుడు కేసులు, నిర్బంధాలు ఉపయోగిస్తున్నారని దేశ సంపదను దోచుకు తింటున్న కార్పొరేట్ కంపెనీలకు మాత్రం లక్షల కోట్ల రూపాయలు రాయితీలుగా ఇస్తున్నారని, ఎన్నికల సమయాల్లో రైతుల ఓట్లకోసం అనేక రకాల పథకాల ఆశలు చూపడం తప్ప ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని ఆదుకునేందుకు రైతులందరూ రాజకీయాలకతీతంగా సమిష్టి పోరాటాలు నిర్వహించాలని, తమ రైతు సంఘం చేస్తున్న ఆందోళన పోరాట కార్యక్రమాల్లో కలిసి రావాలని కోరారు. . అందులో భాగంగానే రుద్రవరం మండలంలో ని ఆలమూరు గ్రామంలో పేదల పక్షపాతి, రైతు శ్రేయస్సు కోసం కృషి చేసే గోవిందరెడ్డి నాయకత్వంలో సుంకన్న, ఓబులేసు, రామకృష్ణ, చిన్న హుసేని,, నరసింహ తో పాటు పలువురు రైతులు రైతు సంఘంలో చేరారని తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ వారికి కండువా కప్పి సంఘం నాయకులకు ఆహ్వానించారు. అనంతరం వారు ప్రాథమిక స్థాయి సభ్యత్వాన్ని తీసుకున్నారు.. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుదర్శన్, వలి, తిరుపాలు నాయక్, మహబూబ్ బాషా, నాగయ్య, కార్మిక సంఘనీ నాయకుడు టి .శ్రీనివాసులు , గిరిజన నాయకుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో కత్తులు దూస్తున్న కోళ్లు?

## గోదావరి జిల్లాల్లో పందాల హడావిడి



సంక్రాంతి వచ్చిందంటే తెలుగునాట కనిపించే కోడి పుంజుల కదన రంగం. కోట్లాది రూపాయలతో ముడిపడిన పందెం.సంక్రాంతి సంబరాలకు సరికొత్త ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని తీసుకొస్తాయి ఈ పందాలు. ప్రభుత్వ అనుమతి లేకున్నా సంప్రదాయంలో భాగంగా ఏటా కోళ్ల పందాలు జోరుగా జరుగుతున్నాయి.ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది.గోదావరి జిల్లాల్లో కోడి పందేల జాతర షురూ అయింది.మనల్నెవడ్రా ఆపేది.. అంటూ కత్తులు కట్టుకుని కాలుదువ్వుతున్నాయి పందెం కోళ్లు. వందలు వేలు దాటి లక్షల్లో బెట్టింగులు కాస్తూ రెచ్చిపోతున్నారు పందెంరాయుళ్లు.ఒక పక్క పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నాలైట్ తీసుకుంటున్నారు పందెం నిర్వాహకులు. ఇప్పటికే 10 వేలకు 20వేలు.. 50వేలకు లక్ష.. లక్షకు రెండు లక్షలంటూ పందెం రేట్లు కూడా ఫిక్స్ చేశారు నిర్వాహకులు. ఇక ఎక్కువ పందాలు గెలిచినవారికి ఆకర్షణీయమైన బహుమతులు కూడా ఇస్తామంటున్నారు. గోదావరి జిల్లాల్లో అయితే ఖరీదైన బహుమతులు ప్రకటించారు. ఎక్కువ పందాలు గెలిచినవారికి బుల్లెట్, బైక్ , రెండు కాసుల బంగారం బహుమతిగా అందించనున్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 200 బరులు సిద్ధం చేసిన నిర్వాహకులు? ఈసారి మరింత స్పెషల్‌గా ప్లాన్ చేస్తున్నారు. కోడి పందాలతో పాటు మహిళలకు కూడా భిన్నరకాల పోటీలు ఉంటాయని అంటున్నారు. ఇక భీమవరంలో క్రికెట్ స్టేడియాలను తలపించేలా బరులను సిద్ధం చేస్తున్నారు. అరేంజ్‌మెంట్స్ కూడా నెక్స్ట్ లెవల్‌లోనే ఉన్నాయి. దీంతో అందరి చూపు భీమవరం జరిగినే కోడి పందాలపైనేఉంది. దీంతో భీమవరంలో నెల రోజుల క్రితమే హోటల్స్ ఫుల్ అయిపోయాయి.మొత్తంగా ఈ మూడు రోజులూ పందెం రాయుళ్లదే హవా. వీళ్ల హడావుడి ఈ రేంజ్‌లో ఉంటే? పోలీసులు కూడా ఈసారి తమ పవర్‌చూపించడానికి రెడీ అవుతున్నారు. కాకపోతే? కోడిపుంజులకు

# పురాణ పురుషులు మల్లాది

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే.ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ధ ప్రతిష్ఠులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి.మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వ్మాయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్సాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా–లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

## తెలుగు సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

యుగయుగాలుగా, తరతరాలుగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్న క్షీర ధార హైందవ సంస్కృతి. ఆ పాల వెల్లువలో పెల్లుబికిన మీగడ తరగలే మన సాంప్రదాయాలు.

హైందవ సంస్కృతీ సంప్రదాయాలకు, ఆచారాలకు "పండగ కేంద్ర బిందువు, పండుగలు శుభ సూచకాలు. ప్రతి కుటుంబంలో కష్ట నష్టాలను మరపించి, నూతనోత్సాహాన్ని కలిగిస్తాయి. పండగలు పురాణేతిహాస, రుతు సంబంధాలు, శీతోష్ణ స్థితుల, సామాజిక జీవన విధానాధారాలుగా ఏర్పడ్డాయి. ప్రతి పండగలో పరమార్థం ఉన్నందునే అవి సాంప్రదాయాలుగా మారాయి. డోలు సన్నాయి వాద్యాలు, వాటి రాగాలకు అనుగుణంగా విన్యాసాలు చేసే అలంకృత గంగిరెద్దులు, హరిలో రంగ హరీ అంటూ, నడినెత్తి నుండి నాసిక దాకా తిరుమణి శ్రీచూర్ణ పట్టైలతో, కంచు గజ్జెలు ఘల్లు ఘల్లుమనగా, బోడి తలపై రాగి అక్షయపాత్ర కదల కుండా, చిందులు తొక్కే హరిదాసులు, అడుగడు గునా ముంగిళ్లలో రంగుల ఆకృతులు, భోగిమం టలు, కొన్ని ప్రాంతాలలో కోడి పందాలు, బొమ్మల పండుగలతో కలబోసిన గ్రామీణ సుందర మనో హర దృశ్యాలు తెలుగు వారికే ప్రత్యేకమైన సాంప్ర దాయ ప్రతీకలు. చాంద్రమానం" పాటించే తెలుగువారు "సౌరమానం" ప్రకారం జరిపే పండుగ సంక్రాంతి", "తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమ కేశు సంచరత: సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తర: రాశౌ సంక్రమణ ప్రవేశ: సంక్రాంతి". మేషం మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి.సంక్రాంతి అంటే మారడం, చేరడం అని అర్థం. కర్కాటకం నుంచి మకర సంక్రాంతి వరకు సూర్యుడు దక్షిణాభి ముఖంగా సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'దక్షిణాయణం' అంటారు. మకర సంక్రాంతి నుంచి కర్కాటక సంక్రాంతి వరకు ఉత్తరాభి ముఖుడై సంచరించడం వల్ల ఈ కాలాన్ని 'ఉత్తరాయణం' అని అంటారు. దేవతలకు ఉత్తరాయణం ఉత్తమ కాలమని, దక్షిణాయణం పితృదేవతలకు ముఖ్య కాలమని భావిస్తారు. ఉత్తరాయణంలో మరణిస్తే మోక్షప్రాప్తి కలుగు తుందంటారు. అందుకే అంపశయ్యపై భీష్మా చార్యుడు ఉత్తరాయణ పుణ్యకాలం వచ్చే వరకు వేచి ఉన్నాడని మహా భారతం చెబుతోంది. మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి సంబరాలలో మొదటిది భోగి పండగ. ఇతర పండుగల వలె తిథి ప్రధానము అయినది కాదు. ఇది ధనుర్మాసానికి, దక్షిణాయనానికి ఆఖరు రోజు. మకర సంక్రమణానికి పూర్వపు రోజు. గోదాదేవి తిరుప్పావై రచన పూర్తి చేసిన ముప్పయవ నాడు రంగ నాథుడు ప్రత్యక్షమై అమెను వివాహమాడతానని, సకల భోగాలు సమకూరుస్తానని చెప్పి, వివాహమాడగా, వివాహ తంతు పూర్తికాగానే ఆమె స్వామి వారిలో ఐక్యం పొందుతుంది.

అందుకే "భోగి" అని ఈ పర్వమానికి పేరు. జన సామాన్యానికి భోగ భాగ్యాలు ఇచ్చే రోజని ప్రతీతి. భోగినాడు మేఘాధిపతి యైన ఇంద్రపూజు చేయడం ఆనవాయితీ. బలి చక్రవర్తి అణగిన దినంగా చెపుతారు. భోగి నాడు భోగి పీడ నివారణ, తెల్లవారగనే అభ్యంగన స్నానం చేయడం, విధాయక కృత్యం. చంటిపిల్లలకు తలంటు పోసి, భోగి పళ్ళు పోయడంతో దృష్టి పరిహారం చేస్తారు.

కొత్త బట్టలు కట్టి, కుర్చీలో కూర్చుండ చేసి, రేగు పళ్ళు, పైసలు, చెరుకు ముక్కలు, బోడికలు దిగువార బోస్తారు. ధనుర్మాసం నెల రోజులు ఆడపిల్లలు తయారు చేసిన గొబ్బి పిడకలు చేయడం, తెల్లవారగట్లు భోగిమంటలు చేయడం ఆచరిస్తారు. మకర సంక్రాంతి సూర్యుడు ఉత్తర గతుడు కావడం త ఉత్తరాయణ ప్రవేశమవుతుంది. ఉత్తరాయణం దేవతలకు అర్థమైన కాలం, ఈ అయనంలో మృతి చెందిన వారు పుణ్యాత్ములై, సూర్య సాయుజ్యం పొందగలరని వేద వచనం. సూర్య సంచారమును బట్టి ఏర్పడిన పండుగ.

ఆడపిల్లలు తెల్లవారు జామున లేచి పెట్టే గొబ్బిల్లు, ఆర్ష కర్మలలో ప్రాముఖ్యం కలిగిన కళా భిజ్ఞత ఉట్టిపడే ముగ్గులు, పళ్ళ నైవేద్యాలు, బాజా భజంత్రీల వాద్యాలు, ఎక్కడ చూసినా ఈనాడు దర్శనమిస్తాయి. రెండవ నాడు జరిపే మకర సంక్రాంతి అత్యంత పురాతనమైనది. సంక్రాంతి నాడు గంగలో స్నానం చేసి, బ్రాహ్మణునికి పెరుగు దానం చేయాలనే నియమాన్ని పాటించిన యశోదకు కృష్ణుడు జన్మించాడని దుర్వాసముని ద్వారా వివరింపబడి, ఆయన సూచనపై ద్రోణాచార్యుని సతి కృపి, సంక్రాంతి పర్వాన్ని జరిపి, పెరుగు దానం చేయడం ద్వారా అశ్వత్థామకు జన్మనిచ్చినట్లు పురాణ కథనం. ఈ సందర్భంగా నువ్వుల ముద్దలతో నలుగు పెట్టుకుని, తలంటి స్నానాలు చేసిన ముత్తయిదువలు, అలంకృతులై, ఐదు మట్టి ముంతలు పుచ్చుకుని, ఒక్కొక్క ముంతలో బియ్యం, పప్పు దినుసులు, చెరుకు, క్యాబేజీ ముక్కలు, రేగుపళ్ళు, నువ్వులు ఉంచి, మూకుడు మూతతో ఉంచి, ఎరిగిన వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి ఇస్తారు. నువ్వులతో చేసిన భక్ష్యాలతో భోజనం చేస్తారు. చిన్నపిల్లలకు మిఠాయి ఉండలు, రేగు పళ్ళు పంచుతారు.మకర సంక్రాంతినాడు రాముని పూజచేసి ఉపవాసం ఉండాలని చతుర్వర్గ చింతామణిలో ఉంది.

ఈనాడు సూర్యుని ఆరాధించి, తిలలు, కూష్మాండాలు, భాండాలు, కంబళి, ధా న్యాలు, లోహాలు, వస్త్రాలు, తైల దీపాలను దానం చేయాలని శాస్త్ర వచనం. భోజనానికి బంధు మిత్రులను ఆహ్వానించడం, నగలతో అలంకరించుకుని నూతన వస్త్ర ధారణ గావించిన ముత్తయిదువలు పంచదారలో నువ్వులు కలిపి చిమ్మిలి చేసి, పంచి పెడతారు. సంవత్సరం పొడువునా, స్నేహితులై ఉండాలని ఆకాంక్షిస్తూ, శుభ, సుఖ ప్రదం కావాలని దీవనలను పెద్దవారి నుండి పొందడం ఆచారం. ఇక చివరిది కనుము పండుగ. అధర్వణ వేదంలో దీనిని వృషభోత్సవమని పేర్కొన్నారు. ముందు సంక్రమణం పెళ్ళిన మరువాడు పశువులకు చేసే పండగ ఇది. కనుమ నాడు మినుములు తినాలట..కనుమనాడు మినుములు తినాలని, లేకపోతే యముడు ఇనుము కొరికిస్తాడని పెద్దలు అంటారు. కొన్ని ప్రాంతాల్లో కనుమనాడు తమ గ్రామ దేవతలకు నైవేద్యాలను సమర్పించే ఆచారం ఉంది. పురుషులు గ్రామ పొలిమేరల్లో కోడి పందాలు, పొట్టేళ్ల పందేలు జరుపుతారు.

.కనుమ రోజున ప్రయాణం పెట్టుకో కూడదని అంటారు. వెళ్తే వెంటనే తిరిగి రావడం కుదరదని ప్రతీతి. కనుమ నాడు కాకి కూడా ఎక్కడకీ బయల్దేరదనే సామెత. కనుమునాడు గోపూజ చేయడం కొన్ని చోట్ల కనిపి స్తుంది. ఆవులను, దూడలను, ఎడ్లను, శుభ్రంగా కడిగి, కొమ్ము లకు ముఖానికి పసుపు రాచి, కుంకుమ పెడతారు. అలంకరణార్థం కుచ్చులు, కొత్త కట్టు తాళ్ళు పెడతాడు. వీధుల వెంట ఊరే గిస్తారు. పశువుల శాలలను శుభ్రపరిచి మామిడాకులు కట్టి, పూలతో అలంకరిస్తారు. సాయం కాలం పొంగిలి నైవేద్యాన్ని పశువుల శాల వద్ద పెడతాడు. పవిత్రోదకం చల్లుతారు. పంటలు పండించే భగవంతునికి పొలాలను దున్నే ఎద్దులకు కృతజ్ఞత తెలిపే పర్వం సంక్రాంతి యనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగు వారికి ఇష్టమైన సంక్రాంతి సంబరాలకు తెలుగు నేల సిద్ధమవుతున్నది.

## అనాథల జీవితాల్లో 'కాంతిరేఖ'

ప్రతి యుద్ధానికి అనాథలు ఉంటారు. ప్రతి సంఘర్షణ దాని మచ్చలను అమాయకులపై వదిలేస్తుంది. ఈ మాట ప్రపంచంలో గతంలో జరిగినా, వర్తమానంలో జరుగుతున్నా, భవిష్యత్‌లో జరగబోయే యుద్ధాలు మిగిల్చే కన్నీటి గాథల గురించే. యుద్ధాలు మిగిల్చే విషాదంలో అత్యంత భయానకమైన జీవితాలు అనాథలదే. అహంకారపూరితమైన ఆధిపత్య కోసం, సంఘర్షణల కారణంగా జరుగుతున్న యుద్ధ భూమిలోని పోరు కోట్లమంది అనాథలను మిగిల్చిపోతుంది. ఈ కన్నీటి ఆవేదనకు ముగింపు ఎక్కడో తెలియక బిక్కుబిక్కుమంటున్న అనాథ పిల్లలు కారుస్తున్న కోట్ల క్యూసెక్కుల కన్నీరుకు కారకులెవ్వరో%ా%అన్ని దేశాలకు తెలిసినా వారికి అడ్డుకట్ట వేసి శాంతి మార్గం వైపు నడిపించేందుకు ఆయా దేశాలు ఇప్పటికీ సమాయత్తం కాకపోవడం ప్రపంచ మానవ సమాజంలో ఓ విషాద పరిణామం. గత రెండు మూడు సంవత్సరాల నుండి పలు దేశాలు, వర్గాల మధ్య జరుగుతున్న యుద్ధాలు సంఘర్షణలో లక్షలాది మంది పిల్లలు అనాథలుగా మారుతున్నారు. గాజా –ఇజ్రాయెల్, రష్యా– ఉక్రెయిన్, ఆర్మేనియా %–% అజర్ బైజాన్, అఫ్ఘానిస్తాన్, ఇథియోపియాలోని టిగ్రే ప్రాంతాల్లోని వర్గాల మధ్య యుద్ధాలు, ఘర్షణల కారణంగా యుద్ధ అనాథల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. యూనిసెఫ్ లెక్కల ప్రకారం యుద్ధాలు మిగిల్చిన విషాదం కారణంగా 140 మిలియన్లకు పైగా అనాథలుండగా, అత్యధికంగా ఆసియా ఖండంలోనే 61 మిలియన్ల మంది అనాథలు ఉన్నారు. 18 శతాబ్దం నుండి 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన యుద్ధాల్లో బాధితుల సంఖ్య 2001 వరకు క్రమంగా పెరిగింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ సమయాల్లో అధికారిక అంచనాల ప్రకారం పోలాండ్‌లో 30 లక్షల మంది, యుగోస్లేవియాలో 2 లక్షల మంది పిల్లలు అనాథలు అయినట్లు లెక్కలు తేలాయి. ప్రపంచ యుద్ధాలలో 1990 నాటికి అనాథ బాధితుల సంఖ్య 146 మిలియన్లులుండగా, 1995 నాటికి 151 మిలియన్లు, 2000 నాటికి 155 మిలియన్లకు బాధితులు చేరుకోవడం విషాదకరమైన పరిణామం. సేవ్ ది చిల్డ్రన్ లెక్కల ప్రకారం ప్రపంచంలో ఆరు మంది పిల్లల్లో ఒక్కరు యుద్ధాలు, వర్గాల సంఘర్షణ జోన్‌లో నివసిస్తున్నారు. ప్రపంచంలో పది దేశాలు అఫ్ఘానిస్తాన్, కాంగో, సిరియా, యెమెన్, సోమాలియా, మాలి, నైజీరియా, కామెరూన్, సూడాన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశాల్లో నివసిస్తున్న పిల్లలు ఈ ఘర్షణల కారణంగా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని అంతర్జాతీయ బాలల హక్కుల సంస్థ గతంలో ప్రకటించింది. సూడాన్‌లో ప్రతి వంద మంది చిన్నారుల్లో 10 మంది అనాథాశ్రమాల్లో మగ్గిపోతున్నారు.ఇటీవల రష్యా సుమారు 14 వేల ఉక్రెయిన్ కుటుంబాల పిల్లలను విడదీసి తమ యుద్ధ క్యాంపులకు తరలించుకుపోయినట్లు తెలుస్తుంది. ప్రపంచంలో ప్రతి దేశంలో ఏదో రూపంలో జరిగిన యుద్ధాలు, ఘర్షణల ఫలితంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాథలుగా, జీవచ్ఛావాలుగా బతుకీడుస్తున్నారు. ప్రపంచంలోని యుద్ధ అనాథల సంక్షేమానికి ఎస్ఓఎస్ ఎన్ఫాంట్స్ ఎన్ డెట్రాసెస్' అనే ఫ్రెంచ్ సంస్థ నడుం బిగించింది. ప్రతి సంవత్సరం యుద్ధ అనాథల దినోత్సవాన్ని (వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్) నిర్వహిస్తుంది. యుద్ధాల సమయంలో అనాథలైన పిల్లల గురించి అవగాహన కల్పించడం, పిల్లల మానవ హక్కులను పరిరక్షించేలా కార్యక్రమాలు రూపొందించడంతో పాటు బలహీన వ్యక్తులకు మద్దతు, రక్షణ అవసరాన్ని చాటిచెప్పేలా చేయడం, వారి అవసరాలను తీర్చి ఉత్తములుగా ఎలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ సంస్థ పనిచేస్తుంది. మిగిలిన పిల్లలలాగే యుద్ధంలో అనాథలైన పిల్లలు కూడా తమ హక్కుల కోసం, స్వేచ్ఛగా జీవించాల్సిన భరోసాని, తమ హృదయాల్లో పడిన గాయాలు తొలగేలా సమాజ జీవనంలో వారిని ఉన్నతంగా ఎదిగేలా చేయాల్సిన బాధ్యత ప్రపంచంలోని అన్ని దేశాలకు ఉంది. సమష్టిగా ప్రపంచ దేశాలు చేతులు కలిపి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. యుద్ధ అనాథలు అనారోగ్యం బారినపడటంతో పాటు లైంగిక దోపిడీకి, మానవ అక్రమ రవాణాకు గురవుతున్నారు. భిక్షాటన ముఠాలు వారిని ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారు. కొన్ని దేశాలు ఈ బాలలను బాల సైనికులుగా మార్చి యుద్ధ భూమి లో బలి పశువులను చేస్తున్నారు. ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం అంటే జ్ఞాపకార్థం కోసమో, స్మరించుకొనే రోజే కాదు. ఇది అనాథల కోసం అండగా నిలిచే చర్యలకు, సహాయాలకు నడుం కట్టించే పిలుపు. యుద్ధంలో తమ తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లవాడి ఆక్రందనను, హృదయ గాయాలను మాన్పించే సమష్టి సమాజం కోసం పయనించాల్సిన సందర్భాన్ని ఎలుగెత్తి చాటే ఓ ఓదార్పు. సంఘర్షణకు గురైన అమాయక బాధితులకు ఓ వెలుగునిచ్చే ప్రయాణం కోసం అడుగులు వేయాల్సిన మానవీయ కోణం. కోట్ల మంది యుద్ధ అనాథ బాలల ఉజ్వల భవిష్యత్ కోసం అవగాహన పెంచడానికి ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం వారి జీవితాల్లో ప్రేమను పంచే ఓ కాంతిరేఖ. 'ప్రపంచంలో చాలా మంది చిన్నరొట్టె ముక్క కోసం చనిపోతున్నారు,

## ఆత్రేయపురంలో బోట్ రేసింగ్

కాకినాడ, జనవరి 13, ఏపీలో సంక్రాంతి జోష్ మామూలుగా లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తొలి సంక్రాంతి కావడంతో అధికార కూటమి నేతలు కొత్త విన్యాసాలకు తెరలేపుతున్నారు. కేరళ అందాలను సొంత చేసుకున్న కోనసీమలో....కేరళ తరహాలో పడవ పోటీలు నిర్వహించారు. ఏపీలో సంక్రాంతి జోష్ మామూలుగా లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తొలి సంక్రాంతి కావడంతో అధికార కూటమి నేతలు కొత్త విన్యాసాలకు తెరలేపుతున్నారు. కేరళ అందాలను సొంత చేసుకున్న కోనసీమలో....కేరళ తరహాలో పడవ పోటీలు నిర్వహించారు. కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురంలో పడవ పోటీలు ప్రత్యేకంగా నిలిచాయి. వీటితో పాటు స్విమ్మింగ్ పోటీలు కూడా నిర్వహించారు.మినీ కేరళగా పేరొందిన కోనసీమ జిల్లా ఎప్పుడూ ప్రత్యేకంగానే నిలుస్తోంది. అక్కడి ప్రజలు, నేతలు వేడుకల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి పండుగ అద్భుతంగా నిర్వహిస్తారు. ఈ పండుగను పురస్కరించుకుని అనేకనేక కొత్త కొత్త ఆలోచనలతో వేడుకలు నిర్వహిస్తున్నారు. కేరళ అందాలకు మాత్రమే కాదు, కేరళ సంప్రదాయ క్రీడలను సైతం వారసత్వంగా నిర్వహిస్తామని అక్కడి ప్రజా ప్రతినిధులు అంటున్నారు.కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు ఆధ్వర్యంలో ఆత్రేయపురంలో కేరళ తరహా పడవ పోటీలు జరిగాయి. దీంతో పాటు స్విమ్మింగ్ పోటీలు కూడా జరిగాయి. ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక మధ్య డెల్టా ప్రధాన పంట కాలువలో ఈ పోటీలు అంగరంగవైభవంగా జరిగాయి. వీటిని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.మూడు రోజుల పాటు జరిగే సర్ అర్థర్ కాటన్ గోదావరి ట్రోఫి సంక్రాంతి సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ట్రోఫి ఉత్సవాలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. స్విమ్మింగ్ పోటీలను ఎంపీ గంటి హరీష్ మాధుర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆత్రేయపురం రోడ్డు నుంచి అధిక సంఖ్యలో మహిళలు రంగవల్లులతో తమ నైపుణ్యానికి అద్దం పట్టారు. పతంగి పోటీల్లో తమ పతంగులను ఎగురవేశారుప్రతి ఏటా ట్రోఫి పోటీలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో విజేతులకు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ బహుమతులు అందజేశారు. అమెరికా నుంచి సంక్రాంతి పండుగకు స్వదేశానికి వచ్చిన 70 ఏళ్ల పైబడిన వృద్ధురాలు స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది

## చాట్రాయి మండలంలో పలువురు టిడిపి నేతల రాజీనామా

ఏలూరు నూజివీడు నియోజకవర్గం లో 200 మంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి ఆదివారం రాత్రి రాజీనామా చేశారు. దీంతో చాట్రాయి మండలం నరసింహారావు పాలెం తెలుగుదేశం పార్టీకి ఎదురు దెబ్బ తగిలింది. గత 20 సంవత్సరాలుగా పార్టీని నమ్ముకుని పార్టీ కోసం కష్టపడితే వేరే పార్టీ నుంచి వచ్చిన వారికి నాయకులు పెద్దపీట వేస్తున్నారని ఆరోపణలు చేశారు. గ్రామ పార్టీ ప్రెసిడెంట్, అందేకృష్ణ. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.గత 20 సంవత్సరాలుగా పార్టీని నమ్ముకొని పార్టీ కోసం కష్టపడితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన నాయకులకే పెద్దపీట వేస్తున్నారి ఆరోపించారు. పార్టీ అధికారంలో లేకపోయినా గ్రామస్థాయిలో సొంత డబ్బులు ఖర్చు పెట్టి పార్టీని బ్రతికించామని అన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి కాకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారికి లోన్లు ఇల్లు ఇస్తున్నారని ఆవేదనతో ముకుమ్మడిగా రాజీనామా చేసారు.

# మోడీ స్కూల్లో టీడీపీ

విశాఖపట్టణం,జనవరి 13, ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సభలో మోదీని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు నిజమేననిపిస్తుంది. మీ స్కూల్.. నా స్కూల్ ఒకటేనని చంద్రబాబు అన్నది అభివృద్ధి.. విజన్ గురించి. అయితే ప్రత్యర్థిని కట్టడి చేయడానికి దూరం చేయడంలో కూడా ఇద్దరి స్కూలు ఒకటే. మోదీ మంత్రాంగంతోనే నేడు అనేక రాష్ట్రాల్లో కమలం పార్టీ జెండా ఎగురగలిగింది. ఏ ఎన్నిక జరిగినా అది బీజేపీ ఖాతాలో పడటం సర్వసాధారణమయింది. జనాలకు కూడా ఇది పెద్దగా ఆశ్చర్య పోవాల్సిన పనిలేకుండా పోయింది. ఎందుకంటే ముందుగానే బీజేపీ విజయాన్ని అంచనా వేసుకుంటున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే సిలబస్ ను పాటిస్తున్నట్లే కనిపిస్తుంది. ప్రత్యర్థులు బలంగా ఉన్న చోట వీక్ చేయడం లక్ష్యం? పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. పైకి ఎవరికీ ఇది అర్థం కాకపోయినా లోతుగా అధ్యయనం చేసే రాజకీయ విశ్లేషకులకు మాత్రం ఇది సులువుగానే అర్థమవుతుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి కూటమి అధికారంలోకి రావాలన్నది చంద్రబాబు ఆలోచన. అందుకు మూడు పార్టీలూ కలసి పోటీ చేస్తాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ లో జగన్ బలమైన శత్రువు. జగన్ ను అంత తేలిగ్గా చంద్రబాబు అంచనా వేయరు. ఎందుకంటే 2024 ఎన్నికల్లోనూ జగన్ ఒంటరిగా పోటీ చేసి 40 శాతం ఓట్లు తెచ్చుకున్నారంటే ఆషామాషీ కాదన్న సంగతి నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియంది కాదు. ఐదు శాతం ఓట్లు పెరిగినా సీట్లు గల్లంతవుతాయి. అందుకే జగన్ కు బలమైన ప్రాంతాల్లో చంద్రబాబు ఫోకస్ పెట్టినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేక స్ట్రాటజీలతో చంద్రబాబు వెళుతున్నట్లే కనిపిస్తుంది. ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే మరొక వైపు జగన్ ను మరింత బలహీనం చేసే ప్రయత్నంలో చంద్రబాబు నిరంతరం స్కెచ్ వేస్తుంటారన్నది కాదనలేని వాస్తవం. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ప్రయోగించినట్లు సమాచారం. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు యువతలోనూ, సామాజికవర్గంలోనూ బలమైన పట్టుంది. రాయలసీమలో జగన్ బలం తక్కువేమీ కాదు. అక్కడ రెడ్డి సామాజికవర్గం ఎక్కువ కావడంతో పాటు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానంతో పాటు టీడీపీ వ్యతిరేక ఓట్ల శాతం ఒకింత ఎక్కువగానే ఉన్నాయి. కానీ గత ఎన్నికల్లో ఎప్పుడూ లేని విధంగా రాయలసీమలోనూ కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించడానికి పవన్ కల్యాణ్ కూడా ఒక కారణమని ఆయన నమ్ముతున్నారు. అందుకే జగన్ సొంత జిల్లా అయిన కడపలోనే కేవలం వైసీపీని మూడు సీట్లకే పరిమితం చేయగలిగామన్నా, ఎన్నడూ గెలవని సీట్లను గెలుచుకున్నా, సుదీర్ఘకాలం తర్వాత నియోజకవర్గాలను సొంతం చేసుకున్నా అందులో పవన్ కల్యాణ్ పాత్ర ఎక్కువగా ఉందని చంద్రబాబు విశ్వసిస్తున్నారు. బలిజ సామాజికవర్గం ఓట్లను... అందుకే రాయలసీమపై పవన్ కల్యాణ్ ను చంద్రబాబు ప్రయోగించినట్లే కనపడుతుంది. పవన్ కల్యాణ్ పర్యటించకున్నా ఉభయ గోదావరి జిల్లాల్లో కూటమి బలంగా ఉంటుంది. ఇక కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలలో తెలుగుదేశం పార్టీ పట్టు సడలదు. ఇక రాయలసీమలో దాదాపు యాభై రెండు నియోజకవర్గాల్లో అత్యధిక స్థానాలను సొంతం చేసుకోవాలంటే అంత సులువు కాదు. జగన్ ను దెబ్బకొట్టాలంటే అక్కడ ఉన్న మరో బలమైన సామాజికవర్గం బలిజలను తమవైపునకు తిప్పుకోవాలి. అందుకే పవన్ కల్యాణ్ తరచూ కడప, కర్నూలు జిల్లాల్లో పర్యటిస్తున్నారని చెబుతున్నారు. చంద్రబాబు సూచనల మేరకే పవన్ కల్యాణ్ సీమ జిల్లాల్లో పర్యటనలు చేస్తున్నారని సమాచారం. కడపలో కూడా క్యాంప్ కార్యాలయం ప్రారంభిస్తానని పవన్ కల్యాణ్ చేసిన ప్రకటన వెనక కూడా ఇదే ప్రధాన కారణం అని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు స్కూలులో సిలబస్ మారినట్లే కనిపిస్తుంది.

# క్యూ ఆర్ కోడ్ లో రేషన్ కార్డులు

కర్నూలు, జనవరి 13, ఏపీలో త్వరలోనే నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. నవ దంపతులకు కొత్త కార్డులు జారీ చేయనుండగా, పేర్ల మార్పు చేర్పులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

ఇప్పటి వరకు రాజకీయ పార్టీల రంగులతో ఇచ్చిన రేషన్ కార్డులకు చరమగీతం పాడడంతో పాటు అత్యాధునిక కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సన్నాహాలు ప్రారంభించారు.ఆరునెలల పాలనా కాలంలో క్రమంగా అధికార యంత్రాంగాన్ని గాడిన పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం.. క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. అందులో భాగంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతిపై పెద్ద ఎత్తున దాడులు చేస్తూ.. అక్రమార్కుల ఆట కట్టించింది. ఇక ఇప్పుడు.. నూతన లబ్ధిదారుల ఎంపిక, వారికి జారీ చేయనున్న కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ఆగిపోగా.. అనేక మంది లబ్దిదారులకు కార్డులు జారీ కాలేదు. అలాంటి వారందరికీ ఇప్పుడు.. సరికొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.కొత్తగా పెళ్లైన దంపతులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించనున్నారు. ఇందు కోసం.. ప్రత్యేకంగా.. ఆన్ లైన్ పోర్టల్ ప్రారంభించనున్నారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకుని.. ఇకపై రేషన్ కార్డుల్ని క్రెడిట్ కార్డుల తరహాలో క్యూఆర్ కోడ్ లతో జారీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే.. సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివర్లో కానీ, వచ్చే నెల ప్రారంభంలో కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల్ని జారీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండనుండగా.. అందులో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఉండనున్నాయి.

రేషన్ పంపిణీ సమయంలో ఆ కోడ్ ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపితే.. వెంటనే కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం.. అధికార యంత్రాగం, ప్రభుత్వం వివిధ పనుల్లో బిజీబిజీగా గడుపుతోంది. తీరికలేని హడావిడిలో ఉండడంతోనే.. కార్డుల ఆమోదం, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వం హయంలో కొత్తగా పెళ్లైన వాళ్లకు వెనువెంటనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ.. కొన్ని నెలలకే ఆ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఆరునెలలకు ఓ సారి మాత్రమే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దాంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేయాల్సిన కొత్త కార్డులు చాలానే మిగిలిపోయాయి. ఈసారి వాటిని జారీ చేయడంతో పాటు వెనువెంటనే నూతన దంపతులకు కార్డులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించనున్నట్లు సమాచారంరాష్ట్రంలోని చాలా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పుల తడకగా మారాయి. దాంతో.. అనేక పథకాల లబ్ధిదారులు నష్టపోతున్నారు. పేర్లు తేడాగా ఉంటున్న కారణంగా చాలా పథకాలకు అనుసంధానించేందుకు వీలు కావడం లేదు. పైగా..ఆన్ లైన్ విధానాన్ని సైతం ఆపేయడంతో.. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఈ సమస్యలన్నింటినీ ఈ సారి నూతన కార్డుల జారీ సమయంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉండగా.. 3.36 లక్షల రేషన్ కార్డు సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో.. 70 వేలకు పైగా నవదంపతుల నుంచి అందిన దరఖాస్తులుగా చెబుతున్నారు. కార్డుల్లో విభజన కోసం 46 వేలకు పైగా, కొత్త సభ్యుల చేరికలకు 2 లక్షల 13 వేలు, సభ్యులను తొలగించేందుకు 36 వేలు, అడ్రస్ మార్పుల కోసం 9 వేలకు పైగా దరఖాస్తులు అందగా.. రేషన్ కార్డుల్ని సరెండర్ చేసేందుకు 685 మంది సిద్ధంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇలా.. అన్ని రకాలుగా చూస్తే మరో 2 లక్షల రేషన్ కార్డులు ఇవ్వాల్సి వస్తుందని అధికారుల అంచనా. దాంతో.. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.50 కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# జాతీయ రహదారిపై పొగమంచు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

యాదాద్రి హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయ రహదారిపై దట్టంగా పొగ మంచు అలుముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు... దీనితో హైవే పై ,టోల్ ప్లాజాల వద్ద వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి.. దట్టంగా పొగ మంచు కురుస్తుండటంతో హెడ్ లైట్లు వేసుకొని వాహనదారులు ముందుకు వెళ్తున్నారు.. ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన వాహనాలు నిలపకుండా హైవే పెట్రోలింగ్ పోలీసులు చర్యలు చేపట్టారు..

# ఇవాళే మకర విళక్కు దర్శనం

తిరువనంతపురం, జనవరి 13 (న్యూస్ పల్స్) మకర విళక్కు జ్యోతి దర్శనం అంటే మకరవిళక్కు శబరిమలలోని అయ్యప్ప ఆలయంలో జరిగే ముఖ్యమైన వార్షిక వేడుక. ఇది శబరిమల ఆలయంలో దర్శనం ఇచ్చే పవిత్రమైన కాంతి... మకరవిళక్కు 2025 జనవరి 14న నిర్వహించడానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మకర విళక్కు దర్శనం కోసం దేశవ్యాప్తంగా మిలియన్ల మంది భక్తులు శబరిమలకు చేరుకుంటున్నారు. మకర జ్యోతిని ప్రత్యక్షంగా దర్శించుకోలేని వారు లైవ్ స్ట్రీమ్ల ద్వారా ఆన్లైన్లో దర్శించుకోవచ్చు. మకర విళక్కు దర్శనానికి కేవలం కొన్ని గంటల సమయం మాత్రమె ఉంది. ఈ రోజు ప్రాముఖ్యత , శబరిమల ఆలయ దర్శన వేళలు, భక్తులు తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయాలను తెలుసుకుందాం..2025 జనవరి 14న మకర విళక్కు దర్శనం ఇస్తుంది. శబరిమల ఆలయం నుంచి మకర విళక్కు దర్శనం సాయంత్రం సూర్యాస్తమయం అవుతుంది. ఆకాశంలో నక్షత్రంలా కనిపించే ఈ కాంతిని దర్శించుకోవడం వలన జీవితంలో ఆనందం, సుఖ సంతోషాలు కలుగుతాయని ప్రజలు నమ్ముతారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి సమయంలో మకర జ్యోతిని దర్శనం సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య జరుగుతుంది.శబరిమల ఆలయంలో సంక్రాంతి రోజున మకరవిళక్కు ఉత్సవం జరుగుతుంది. ఇది సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్ని కేరళ ప్రజలు జరుపుకునే విధానం. మకరవిళక్కు అనేది పొన్నంబలమేడు అడవిలో ఉన్న మలయమాన్ కారి వారసులుగా భావించబడే మలయరాయ తెగ వారు పూర్వకాలం నుంచి ఆచరిస్తున్న మతపరమైన ఆచారంలో ఒక భాగం. మకర జ్యోతిని చూసేందుకు ప్రతి సంవత్సరం సగటున లక్షన్నర మంది శబరిమలకు చేరుకుంటారని అంచనా.మకర జ్యోతి అంటే కాంతిని వ్యాప్తి చేయడానికి, రేపు ఆశాజనకంగా ఉండేలా చేసే అత్యంత ముఖ్యమైన ఆచారం అని నమ్మకం. ఈ పండుగలో తిరువాభరణం (అయ్యప్ప స్వామికి అలంకరించే పవిత్ర ఆభరణాలు) ఊరేగింపు ప్రధాన ఆకర్షణ. ప్రతి సంవత్సరం మకర జ్యోతి దర్శనానికి ముందు అయ్యప్ప కి అలంకరించే ఆభరణాలను పందళం నుంచి తీసుకుని శబరిమలకు పయనం అవుతారు. పందళ వంశస్థులు అయ్యప్ప స్వామికి బంగారు ఆభరణాలను తయారు చేయించి ప్రతి సంవత్సరం విళక్కు దర్శనం రోజున అలంకరిస్తారు. ఈ బంగారు ఆభరణాలను పందళ రాజ్యం నుంచి 3 రోజుల పాటు ప్రయాణం చేసి సాయంత్రం అయ్యప్ప సన్నిదానానికి చేరుకుంటారు

# ముక్కలైపోయిన ఇండియా కూటమి

ఇండియా కూటమి మూడునాళ్ల ముచ్చటే అని తేలిపోయింది. విభిన్న సిద్ధాంతాలు, అభిప్రాయాలు గల దాదాపు 24 పార్టీలు ఏకంకావడమే అరుదు. జెడి(యు) అధినేత నితీశ్ కుమార్ సూచనతో కేంద్రంలో బిజెపిని 2024 పార్లమెంటు ఎన్నికలలో ఓడించడమే లక్ష్యంగా కూటమి ఏర్పడింది. అనూహ్యంగా కాంగ్రెస్ కూటమిలో పెద్దన్నపాత్ర వహించాల్సి వచ్చింది. కూటమి కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఎన్నుకోవాలన్న భావన అదిలోనే దెబ్బతింది. ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన మమతా బెనర్జీ మొదటినుంచి ఇండియా కూటమిపట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ పెత్తనం ఆమెకు అసలే ఇష్టం లేదు. ఇక కమ్యూనిస్టులు అంటే ఎప్పుడూ చుక్కెదురే.కూటమిలో లెఫ్ట్ పార్టీలతో సహ భాగస్వామిగా ఉండేందుకు విముఖత చూపారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమికి చెందిన కీలక పార్టీలు కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆ?ప)కి మద్దతు ప్రకటించాయి. దీంతో కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రె స్ ఏకాకిగా మారింది. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌దీ పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్‌కు అండగా నిలవాలని నిర్ణయించాయి. ఢిల్లీలో ఆప్ పార్టీ బలంగా ఉందని శివసేన(యూబీటీ) ప్రకటించింది. ఈ పరిణామంతో అసలు ఇండియా కూటమి అస్తిత్వంలో ఉందా? లేదా? అన్న విషయం చర్చగా మారింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ కూటమి భేటీ ఒక్కటి కూడా జరగకపోవడం ఇక్కడ గమనార్హం. అయితే, ఢిల్లీలో కాంగ్రె?సకు ఆప్ ప్రత్యర్థి పార్టీయేనని, ఆ పార్టీతో తమకు ప్రాంతీయ స్థాయిలో అవగాహన లేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కేరళలో వామపక్షాల విషయంలో కూడా ఇదే వైఖరి ప్రదర్శిస్తున్నట్టు తెలిపాయి. పార్లమెంటులో ఇండియా కూటమి సభ్యులంతా ఏకతాటిపై నడుస్తున్నారని ఈ వర్గాలు చెప్పాయి. ఇండియా కూటమి సభ్యులు సంఘటితంగా వ్యవహరించినందువల్లే వక్ఫ్ బిల్లు, జమిలి ఎన్నికల బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించాల్సి వచ్చిందని తెలిపాయి.ఇక బెంగాల్‌లో అసెంబ్లీ గానీ, పార్లమెంటు ఎన్నికలు గానీ ఏ ఎన్నికల్లో అయినా ఒంటరిపోరే తమ సిద్ధాంతంగా ఎంచుకున్నారు. కాంగ్రెస్‌కు 2 పార్లమెంటు స్థానాలు కూడా ఇచ్చేందుకు అంగీకరించలేదు. బెంగాల్‌లో 34 ఏళ్లు అధికారంలో ఉన్నా.. నానాటికీ దిగజారిపోయాయి వామపక్షాలు. బెంగాల్‌లో 48ఏళ్లుగా అధికారానికి దూరమై ఏ ఏటికాయేడు పతనమై.. ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిన కాంగ్రెస్, కమ్యూనిస్ట్ లతో కలిసినా కనీసం ఏ ఎన్నికలలోనూ విజయాన్ని అందుకోలేకపోయారు. పార్లమెంటు ఎన్నికల నాటికి కూటమిలో కీలక పార్టీలు బిజెపికి దీటుగా ఒకే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలన్న లక్ష్యం మసక బారిపోయింది. ఆమ్‌ఆద్మీ పార్టీ కేజ్రీవాల్ పరిస్థితి మరోలా ఉంది. ఇష్టం లేకుండానే కూటమిలో చేరినట్లు కన్పించారు. లోక్‌సభ ఎన్నికల నాటికి ఢిల్లీలో పొత్తు.. పంజాబ్‌లో లేదు అన్నట్లు వ్యవహరించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ తీరు మరోలా ఉంది. కాంగ్రెస్‌తో ఉన్నట్లే ఉన్నా.. ఎప్పటికప్పుడు ఆ పార్టీకి చెక్ పెట్టే ధోరణిలోనే వ్యవహరించారు.మధ్యప్రదేశ్‌లో కనీసం స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ సహకరించకపోవడంతో పూర్తిగా దూరమయ్యారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమితో ఆ పార్టీపై ప్రతిపక్షాలలో ముఖ్యంగా కూటమి పార్టీలలో పూర్తిగా నమ్మకంపోయింది. కాంగ్రెస్‌కు దాదాపు అన్ని పార్టీలు దూరమయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్ కలిసినా, మహబూబా ముఫ్తీ ఒంటరి పోరుకు సిద్ధమయ్యారు. వయో భారం, అనారోగ్యం కారణంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ అంత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనడం లేదు. ఎన్‌సిపిను అజిత్ పవార్‌వర్గం చీల్చిన తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరద్ పవార్ ఇంటికే పరిమితమయ్యారు. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమి పూర్తిగా రద్దయి పోయినట్లయింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ రెండు టర్మ్‌లుగా అధికారంలో ఉంటోందిపదేళ్లుగా కాంగ్రెస్ ఒక అసెంబ్లీ స్థానం కూడా గెలవలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, ఆమ్‌ఆద్మీ పార్టీకి డైరెక్ట్ ఫైట్‌గా కన్పిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైంది. ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాకుండా చూడాలంటే.. ఆమ్‌ఆద్మీ పార్టీకి గంపగుత్తగా మద్దతు ఇవ్వాలని ఇండియా కూటమిలో కీలక పార్టీలు నిర్వహించాయి. దీంతో సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌జెడి, శివసేన ఉద్ధవ్ పార్టీ ఆమ్‌ఆద్మీ పార్టీకే మద్దతుగా నిలిచాయి. దీంతో కాంగ్రెస్ ఏకాకి అయింది. ఆ పార్టీకి ఆఖరుకు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా దూరమైంది. ఢిల్లీలో బీఎస్పీ, ఎంఐఎం సహా మరికొన్ని చిన్నపార్టీలు కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుండడంతో కీలకమైన ఓటు బ్యాంకు చీలే అవకాశం ఉందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ముస్లిం ప్రభావిత నియోజకవర్గాలపై ఎంఐఎం దృష్టి పెట్టింది.

ఇక, 70 నియోజకవర్గాల్లోనూ తమ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు బీఎస్పీ ప్రయత్నిస్తోంది. అంతేకాదు.. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల ముఖ్య నాయకులు రంగంలోకి దిగుతున్నారు. అదేవిధంగా భారతీయ లిబరల్ పార్టీ(బీఎల్పీ) కూడా 70 స్థానాల్లోనూ తన అభ్యర్థులను బరిలోకి దింపింది. ఆయా పార్టీలు స్థానిక, సామాజిక వర్గ సమస్యలతోపాటు అవినీతి, లంచాలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాయి.ఇండియా కూటమి అన్నది కేవలం పార్లమెంటు ఎన్నికల కోసం ఏర్పడిందని ఆయన ప్రకటించారు కూడా.

దీంతో ఇండియా కూటమి ముక్కచెక్కలైనట్లు స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కలే? భవిష్యత్‌లో. ప్రతిపక్షాల ఐక్యత అసాధ్యమే అని తేలిపోయింది.

# మందా జగన్నాధానికి కన్నీటి వీడ్కోలు

హైదరాబాద్, జనవరి 13, నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంటు సభ్యులు మందా జగన్నం కన్నుమూశారు. గత కొద్దిరోజులు అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. నాలుగు సార్లు నాగర్ కర్నూల్ ఎంపీగా మందా జగన్నాథం ప్రాతినిథ్యం వహించారు. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరఫున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై విజయం సాధించారు. ఆతర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో అవకాశం దక్కలేదు. ఈ నేపథ్యంలో 2022, జూలై 1న ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను నియమించారు. 2023 నవంబర్ 17న బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే నాగర్‌కర్నూల్ టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ తీర్థం పుచ్చుకున్నారు.

ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కుమార్తె ? మంద పల్లవి. మెడికల్ కోర్సు ఓ.ూ ప్రసూతి, గైనకాలజీ (లేడీస్ స్పెషలిస్ట్) లో ప్రభుత్వంలో పని చేస్తున్నారు. పెద్ద కొడుకు మంద శ్రీనాథ్ బీటెక్ (మెకానికల్ ఇంజనీర్) చదివారు సోషల్ వర్కర్ గా వున్నారు. చిన్న కొడుకు మంద విశ్వనాథ్ ఓఃబా చదివి తన వృత్తిలో కొనసాగుతున్నారు. తండ్రి మంద పుల్లయ్య, తల్లి మంద సవరమ్మ. తండ్రి పుల్లయ్య నాగార్జున సాగర్‌లోని పైలాన్ కాలనీలో మెకానికల్ విభాగంలో వాచ్‌మెన్‌గా పనిచేసినారు. తల్లి సవరమ్మ నాగార్జున సాగర్‌లోని హిల్‌కాలనీలో ఆఫీస్ అటెండెంట్‌గా పనిచేశారు.నాగార్జున సాగర్‌లోని హిల్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి నుంచి 4వ తరగతి వరకు చదివారు. 6 నుంచి 8వ తరగతి వరకు నాగార్జున సాగర్‌లోని హిల్‌కాలనీలోని హైస్కూల్‌లో చదివారు. 9, 10వ తరగతులను వరంగల్ జిల్లా సంగంలోని జిఖఉఝాలో కొనసాగించారు. వికారాబాద్‌లోని జెడ్‌పి హైస్కూల్‌లో ఊఆఅ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ నిజాం కళాశాలలో ఖజఅ చదివారు. ఆ తర్వాత ఓఃబా కోర్సులో హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో చేరారు. తర్వాత ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంఎస్‌డిఎల్‌ఓ, ఇఎన్‌టి స్పెషలిస్ట్ సర్జన్ కోర్సు చేశారు. సూర్యాపేటలోని సివిల్ హాస్పిటల్‌లో అసిస్టెంట్ సర్జన్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 8వ ఃఔ ఞఖూఖలో పోలీస్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో, హైదరాబాద్‌లోని ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఈఎన్‌టీ సర్జన్‌గా పనిచేశారు.పాఠశాలలో చదువుతున్న రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రం క్లబ్ హిల్ కాలనీలో టెన్నిస్ బాల్ పికప్ బాయ్‌గా పనిచేశారు మంద జగన్నాథం. పేద కుటుంబానికి చెందిన జగన్నాథం పాఠశాల ఖర్చులకు వేసవి సెలవుల్లో నాగార్జున సాగర్ డ్యామ్‌లోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో వాటర్ బాయ్‌గా పనిచేశారు. కొన్నిసార్లు వేసవి సెలవుల్లో రోజుకు 0.50 పైసల స్వల్ప రోజువారీ కూలీకి నాగార్జున సాగర్ నిర్మాణ స్థలంలో కూలీగా పని చేశారు. కానీ చదువులకు, తరగతిలో ర్యాంకింగ్‌లకు ఆటంకం కలిగించలేదు మంద జగన్నాథం. తరగతిలో ఎల్లప్పుడూ టాప్ స్కోరర్‌గా నిలిచారు.

రాజకీయ రంగ ప్రవేశం:-

1996లో నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు తెలుగు దేశం పార్టీలో చేరిన మంద జగన్నాథం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పార్లమెంట్ (లోక్‌సభ) సభ్యునిగా పోటీ చేసి తొలిసారిగా ఎన్నికయ్యారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి వరుసగా 4 సార్లు ఎంపీగా (లోక్‌సభ) ఎన్నికయ్యారు. 1996 ? 11వ లోక్‌సభకు (టిడిపి) ఎన్నికయ్యారు. 1999 ? 13వ లోక్‌సభకు తిరిగి ఎన్నికయ్యారు (2వ పర్యాయం) (ఎఆఖ) 2004 ? 14వ లోక్‌సభకు (3వసారి) తిరిగి ఎన్నికయ్యారు (ఎఆఖ) 2009 ? 15వ లోక్‌సభకు (4వ పర్యాయం) తిరిగి ఎన్నికయ్యారు (కాంగ్రెస్) 2014 ? ఎఖీూ పార్టీ నుండి పోటీ చేసి కార్ గుర్తు లో పోలిక ఉన్నటువంటి స్వతంత్ర అభ్యర్థి వల్ల సల్ప మెజారిటీతో ఓడిపోయారు.. 2018 ? న్యూఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా కేబినెట్ హోదాలో నామినేట్ అయ్యారు. (9 జూన్ 2018 ? 8 జూన్ 2019)

# మోడీ చానెల్ తో నెలకు కోటి నుంచి 3 కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ, జనవరి 13,అటు రాజకీయాల్లో.. ఇటు ఇంటర్నెట్‌లో.. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. పాలిటిక్స్‌లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే ఆయన సోషల్ మీడియాలో ఒక్క పోస్ట్ పెట్టారంటే చాలు.. కోట్లలో లైకులు, షేర్లు, కామెంట్స్ వచ్చిపడతాయి. క్షణాల్లో వైరల్‌గా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్‌లో 20 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబార్లు ఉన్న రాజకీయ నేతగా ప్రధాని మోదీ అగ్రస్థానంలో నిలిచారు. ఆయనకంటూ అధికారిక యూట్యూబ్ ఛానెల్ ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో ఆయన చేపట్టే అన్ని ప్రారంభోత్సవాలు, అధికారిక కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు ప్రసారమవుతాయి. మరి ఈ ఛానెల్‌కు ఎంతమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఎంత ఆదాయం వస్తుందో తెలిస్తే షాక్ అవుతారు.ప్రధాని మోదీకి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాతో సహా వివిధ సోషల్ మీడియాలో ప్లాట్‌ఫామ్స్‌లో అకౌంట్లు ఉన్నాయి. అదేవిధంగా ఆయనకు ఓ అధికారిక యూట్యూబ్ ఛానెల్ కూడా ఉంది. ఈ ఛానల్ 2007 అక్టోబర్ 26వ తేదీన ప్రారంభించారు. ఈ ఛానెల్‌కు 26 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉండగా.. ఇప్పటివరకు 29,272 వీడియోలు పోస్ట్ అయ్యాయి. ఇక ఆ వీడియోలకు మొత్తం 636 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఓ నివేదిక ప్రకారం ఈ ఛానెల్ ద్వారా ప్రధాని మోదీకి నెలకు రూ. 1.62 కోట్ల నుంచి రూ. 4.88 కోట్ల ఆదాయం వస్తోందట.

# మహాకుంభమేళకు వైరస్ ముప్పు

లక్నో, జనవరి 13, (న్యూస్ పల్స్)ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభ మేళా వేడుక ఘనంగా ప్రారంభమైంది. త్రివేణీ సంగమ క్షేత్రంలో పవిత్ర స్నానమాచరించేందుకు లక్షలాది మంది భక్తులు తరలి వచ్చారు.

పుష్య మాసం పౌర్ణమి రోజున ఈ మహా కుంభ మొదలు కావడం మాత్రమే కాదు ఈ రోజు మొదటి రాజ స్నానం. ఈ సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఈ కుంభమేళాలో సాధువుల 13 అఖాడాలు కూడా పాల్గొననున్నాయి. పంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక అయిన ఈ మహా కుంభ 45 రోజుల పాటు సాగనుంది.. ఫిబ్రవరి 25 వ తేదీన మహా శివరాత్రి రోజున రాజ స్నానంతో ఈ వేడుక ముగుస్తుంది. ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశం నలుమూల నుంచయి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తారని గంగా, యమునా, సరస్వతీ నదుల సంగమ ప్రదేశంలో పవిత్ర స్నానం ఆచరిస్తారని భావిస్తున్నారు. దీంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసింది యుపీ సర్కార్.

రెండు నెలల నుంచి ఏర్పాట్లు

ప్రపంచస్థాయిలో ప్రత్యేక వేడుకగా కుంభమేళాను నిర్వహించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. రెండు నెలలుగా రాత్రింబవళ్లు కార్మికులు ఇక్కడి ఏర్పాట్లు చూస్తున్నారు.

వివిధ దేశాల భక్తులు వచ్చే అవకాశం ఉందన్న అంచనాలతో ఏర్పాట్లను కూడా అదే స్థాయిలో చేస్తున్నారు. ఇదంతా ఓకే కానీ ఈ సమయంలో ఉరుములు లేని పిడుగులా ఓ వార్త ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కోట్లాది మంది భక్తులు ఒకేచోటకు చేరే మహా కుంభమేళా సమయం దగ్గరయ్యేకొద్దీ ఈ కలవరం తీవ్రం అవుతోంది. చైనాలో వైరస్ ... ఈ మాట వినిపిస్తే ప్రపంచ దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. కరోనా ప్రపంచానికి మిగిల్చిన చేదు జ్ఞాపకాలు అందుకు కారణం. ఇప్పుడు హెచ్‌ఎంపీవీ వైరస్ తెరపైకి వచ్చింది. కుంభమేళాకు సంబంధించి కలవరానకి కారణం ఈ వైరస్. ఇప్పటికే కర్ణాటకలో రెండు, చెన్నైలో రెండు, గుజరాత్ లో ఒక కేసు నమోదవ్వడం భయాన్ని పెంచుతోంది. చిన్న పిల్లలు, వృద్ధులకు హెచ్‌ఎంపీవీ వైరస్ త్వరగా సోకుతుందని డాక్టర్లు చెపుతున్నారు. వైరస్ లక్షణాలు కూడా ఇంచుమించు కరోనాను పోలి ఉంటున్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ సమయంలో సుమారు 45 రోజుల పాటు సాగనున్న మహా కుంభమేళా ఇప్పుడు రకరకాల భయాలకు కారణం అవుతోంది. మహాకుంభమేళాకు ఉత్తరప్రదేశ్ సర్కార్ భారీ ఏర్పాట్లు చేసింది. అందుకోసం రూ.7,500 కోట్లు ఖర్చు చేసిందట.

ఈ వేడుకలో పాల్గొనేవారి సంఖ్యను లెక్కించడానికి అత్యాధునిక టెక్నాలజీని వినియోగించనున్నారు. భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు 1.6 లక్షల టెంట్లు, సుమారు ఒకటిన్నర లక్షల మరుగుదొడ్ల ఏర్పాటూ చేస్తున్నారు. ఇదే సమయంలో భక్తులకు, పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా సుమారు 10 వేల బోట్లను సిద్ధం చేస్తున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి 40 కోట్ల మంది భక్తులు ప్రయాగ్ రాజ్ కు వచ్చే అవకాశం ఉందని అంచనా. 12 ఏళ్లకోసారి జరిగే ఈ కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించాలని వచ్చే కోట్లాది మంది భక్తుల్లో పెద్దవారు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 40 కోట్ల మంది ఒకే ప్రదేశానికి వచ్చి వెళ్లనుండటం.. సరిగ్గా ఇదే సమయంలో హెచ్‌ఎంపీవీ ఆందోళన కలిగిస్తుండటమో ఈ విషయం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కుంభమేళాకు వచ్చే ప్రతీ భక్తుడికీ ఈ వైరస్ ఉందా లేదా అని పరీక్షించి పంపడం ప్రాక్టికల్ గా సాధ్యమవుతుందా..? అలాకానిపక్షంలో అన్ని దేశాల నుంచీ ప్రజలు రావడం వల్ల వైరస్ వ్యాప్తి ఏ స్థాయికి చేరుకుంటుంది..? కోవిడ్ సమయంలోనూ మొదట్లో లైట్ తీసుకున్నా, తర్వాత వణికించేసింది కదా..? అలా అని ఈ కుంభమేళాను వాయిదా వేసే పరిస్థితి ఉండదు కదా..? వంటి ప్రశ్నలు ఇప్పుడూ నెట్టింట వైరల్ గా మారుతున్నాయి. మరి ఇంత క్లిష్టమైన పరిస్థితులుగా మారినట్లు చెబుతున్న వేళ.. మహా కుంభమేళా నిర్వహణ – హెచ్‌ఎంపీవీ వ్యాప్తిని అడ్డుకోవడం వంటి విషయాల్లో కేంద్ర, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలూ ఎలాంటి నిర్ణయాలు, మరెలాంటి జాగ్రత్తలు తీసుకుంటాయనేది ప్రశ్నార్ధకమే.కుంభమేళా ఏర్పాట్లను మాత్రం ఓ రేంజ్ లో చేస్తున్నారు. రహదారుల వెడల్పు నుంచి సంగమ ఘాట్ల సుందరీకరణ వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా మహా కుంభమేళా నిర్వహణలో తలమునకలయ్యింది. ప్రధాని నరేంద్ర మోడీ తన మన్‌కీ బాత్‌లో మహాకుంభ మేళాను.. ఐక్యతా మహాకుంభ్ గా అభివర్ణించారు. ఆక్రమణలు, కోత కారణంగా సంగమం వద్ద గంగా నది 200 నుంచి 500 మీటర్ల వరకు తగ్గిపోయింది.

2024 ప్రారంభంలో అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లను మించి మహాకుంభ మేళాకు ఇప్పుడు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహాకుంభమేళాను హరిత మేళాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎటు చూసినా పచ్చని చెట్లు, పూల మొక్కలతో సంగమ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 3 లక్షల మొక్కలను ఇక్కడ నాటారు. 12 కిలో మీటర్ల మేర అతిపెద్ద ఘాట్‌ను నిర్మించారు. మేళాకు వచ్చే భక్తుల మనసులు దోచుకునేలా సంగమ ప్రాంతంలోని లక్షా 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రామాయణ, మహాభారతాల్లోని పలు అంశాలతో కూడిన కుడ్య చిత్రాలు, తైలవర్ణ చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు స్వాగతాలు పలికే చిత్రాలు కూడా మనసును దోచుకునేలా చిత్రీకరిస్తున్నారు. మహాకుంభమేళాకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నారు. మొత్తంగా ఏడంచల్లో భద్రతా ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీసులు 13 తాత్కాలిక పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం స్టేషన్ల సంఖ్య 57కు చేరింది. మహాకుంభమేళా జరిగే జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలు సహా విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్, బస్టాండ్ల వద్ద 23 తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాయుధ కానిస్టేబుళ్లు, 4 జాతీయ విపత్తు స్పందనా దళాలను, 21 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. ఒక్క రాష్ట్ర పోలీసులే 10 వేల మంది భద్రతా విధుల్లో ఉండనున్నారు. మతపరమైన కార్యక్రమాల్లో మహాకుంభమేళా ప్రపంచంలో అతి పెద్దది. మహాకుంభమేళా పుష్య పౌర్ణమి తిథినాడు.. అంటే జనవరి 13న ప్రారంభం అవుతుంది. 45 రోజుల పాటు కొనసాగిన తర్వాత మహాశివరాత్రి అంటే ఫిబ్రవరి 26న ముగియనుంది. తొలి పవిత్ర స్నానాలు మకర సంక్రాంతినాడు ప్రారంభంకానున్నాయి.

## క్రౌడ్ ఫండింగ్ తో అతిషీ క్యాంపెయిన్

న్యూఢిల్లీ, జనవరి 13, (న్యూస్ పల్స్) పోలింగ్ గడువు సమీపిస్తుండడంతో దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. ప్రధాన పోటీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ మధ్యే ఉంది. కాంగ్రెస్ కూడా ఒంటరిగా బరిలోకి దిగడంతో త్రిముఖ పోటీ తలెత్తడం ఖాయం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరుగుతాయని తెలిసిందే. అదే నెల 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ నెల 10న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయబడింది. ఆ రోజు నుంచి నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ఈ నెల 17 చివరి తేదీ.ఈ పరిస్థితుల మధ్య ముఖ్యమంత్రి అతిషి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం ఆమె కొత్త కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సేకరించాలని ఆమె నిర్ణయించింది. ఆమె ఈ ఉదయం తన నియోజకవర్గంలో క్రౌడ్ ఫండింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషికి క్రౌడ్ ఫండింగ్ కింద కేవలం 4 గంటల్లోనే 11 లక్షల రూపాయలకు పైగా విరాళాలు అందాయి. 190 మంది అతిషికి రూ.11 లక్షల 2 వేల 606 విరాళంగా ఇచ్చారు. అతిషి ఉదయం 10 గంటలకు క్రౌడ్ ఫండింగ్ కోసం విజ్ఞప్తి చేశారు. కల్కాజీ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అతిషి రూ.40 లక్షల క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఎన్నికల్లో పోటీ చేయడానికి నాకు డబ్బు అవసరమని అతిషి చెప్పింది. ఎన్నికల్లో పోటీ చేయడానికి నాకు రూ.40 లక్షలు కావాలి. నా క్రౌడ్ ఫండింగ్ ప్రచారానికి మద్దతు ఇవ్వండి. మేము పారిశ్రామికవేత్తల నుండి విరాళాలు తీసుకోబోమని అతిషి చెప్పారు. మేము ప్రజల నుండి వచ్చే విరాళాలతో ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అతిషి జీబిష్త్రతిబష్త్రతి.జీజీఎజీజీటఎతిజూజీతీబిఎ.నీతీణ అనే లింక్‌ను విడుదల చేస్తూ.. ఒక నాయకుడు ప్రజా విరాళాలతో ఎన్నికల్లో పోటీ చేస్తే, ఏర్పడిన ప్రభుత్వం అతని కోసం పనిచేస్తుందని, అతను పారిశ్రామికవేత్తల నుండి డబ్బు తీసుకొని పోటీ చేస్తే, అది అతనికి పని చేస్తుందని అన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ ఏర్పడినప్పటి నుండి ఢిల్లీలోని సామాన్య ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ఇవ్వడానికి, ఎన్నికల్లో పోటీ చేయడానికి విరాళాలు ఇచ్చారని అతిషి విలేకరుల సమావేశంలో అన్నారు. 2013లో కూడా ప్రజలు ఎన్నికల్లో చిన్న చిన్న విరాళాలు ఇచ్చారు. 2013లో తను మొదటి ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఇంటింటికి వెళ్ళానన్నారు. ప్రజలు అప్పుడు 10 రూపాయలు, 50 రూపాయలు, 100 రూపాయల ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నిజాయితీగల రాజకీయాలు పెద్ద వ్యాపారవేత్తల నుండి విరాళాలు తీసుకోకపోవడం వల్లే సాధ్యమయ్యాయని ఆయన అన్నారు. వ్యాపారవేత్తల నుండి డబ్బు తీసుకున్న పార్టీలు, ఆ తర్వాత వారి ప్రభుత్వాలు వ్యాపారవేత్తల కోసం పనిచేస్తాయన్నారు. బిజెపి జాబితాకు సంబంధించి రెండు విషయాలు వెలుగులోకి వస్తున్నాయని అతిషి అన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి బిజెపికి అభ్యర్థి లేరు. లేకపోతే ఎందుకు అంత సమయం తీసుకుంటుంది. బిజెపి సీనియర్ నాయకులు ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా లేరని వినిపిస్తోందన్నారు.

## అడ్డగోలుగా ధరణిలోకి భూములు

మహబూబ్ నగర్, జనవరి 13, నారాయణపేట జిల్లా, కోస్గి పరిధిలోని మల్రెడ్డి పల్లె గ్రామం. ఇక్కడి దళిత రైతులు.. గ్రామ శివార్లలోని 391, 392, 376 సర్వేనెంబర్ లలో ఇనాం భూములను తాత ముత్తాతల కాలం నుండి అనుభవిస్తున్నారు. ఈ భూములు కోస్గి పట్టణానికి చెందిన కోల్కొంది లక్ష్మణ శర్మ కుటుంబ సభ్యుల నుంచి.. కామారం వెంకటేష్ మరో 10 దళిత కుటుంబాలకు అనుభవించేందుకు హక్కులు కల్పించారు. అంతేకాకుండా 1947 వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వాలు దళితులకు భూ యజమానుల దగ్గర హక్కులు కల్పించి టేనెన్సీ యాక్ట్ ప్రకారం సీలింగ్ భూములు అందజేశారు. ఆనాటి నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయీ దళిత కుటుంబాలు.1996లో నాటి కోస్గి తాసిల్దార్ వీరిని భూ ప్రొటెక్టెన్సీ దారులుగా ప్రకటిస్తూ.. ఈ భూముల్ని సంబంధిత దళితులకు అప్పజెప్పారు. అంతా సజావుగా జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన ధరణి పోర్టల్ వీరి పాలిట శాపంగా మారింది. ధరణి పోర్టల్ లో అనుభవదారుల కాలం తీసివేయడంతో కొందరీ భూములపై కన్నేశారు. ఈ లొసుగును ఆసరాగా చేసుకున్న బీఆర్ఎస్ నేతలు తమ భూముల్ని గతంలో ఇచ్చిన వారితో కుమ్మక్కై అమ్మకానికి సిద్ధం చేశారని బాధ పడుతున్నారు.సమస్య తలెత్తిన వెంటనే వీరంతా కలసి.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డికి తమకొచ్చిన కష్టం గురించి చెప్పుకున్నారు.. ఇప్పటికి ఎన్నోసార్లు నాటి ఎమ్మెల్యే కి చెప్పినా పెద్దగా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారీ దళిత రైతులు. సరే చూద్దాం చేద్దాం అంటూనే ఆ భూముల అమ్మకానికి ఆయనే తెర లేపాడన్నది ఈ భూముల్లో వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న దళిత రైతుల ప్రధాన ఆరోపణ.ధరణి పోర్టల్ రాకతో ఈ భూమికి సంబంధించి గత యజమానులకు పట్టా పాస్ బుక్కులు వచ్చాయి. దీన్ని ఆసరాగా చేసుకుని గత ప్రభుత్వ హాయంలో మల్ రెడ్డి పల్లి కౌన్సిలర్ గా ఉన్న లింగం లక్ష్మమ్మ సోదరులు ఈ భూమిపై కన్నేశారనీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారీ వ్యవసాయదారులు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహకారంతోనే ధరణిలో రిజిస్ట్రేషన్ పేరు మార్పు చేసి తమ పేర్లు వచ్చేలా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారీ దళిత రైతన్నలు. తాజాగా ఈ భూములు తమవేనంటూ లింగం లక్ష్మమ్మ సోదరులు దున్నడానికి రాగా వీరిని తమ సాయశక్తులా అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే భూమిపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని అలాంటి భూముల్ని మా నుండి దూరం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.ట్రాక్టర్ తో పొలం చదును చేయడానికి వచ్చిన లింగం లక్ష్మమ్మ సోదరులను అడ్డుకున్నారీ దళిత సోదరులు. తమ ప్రాణం పోయినా సరే, భూమిని వదులుకునే ప్రసక్తే లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇదంతా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రోత్బలంతోనే జరుగుతోందని.. ధర్నాకు దిగారు దళితులు. భూములు వదులుకోకుంటే మీ అంతు చూస్తామంటూ లింగం సోదరులు భయపెడుతున్నారని.. ప్రభుత్వం తమకు రక్షణ కల్పించి.. తగిన న్యాయం చేయాలని దళిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యోగులకు మరో రోజు సెలవు

విజయవాడ,జనవరి 13, సంక్రాంతి సందర్భంగా బ్యాంకు ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారికి పండుగ సెలవులు మరో రోజు పొడిగించింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, 2025 ప్రభుత్వ సెలవుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులకు సర్కారు జనవరి 14న సంక్రాంతి రోజు మాత్రమే సెలవుగా ప్రకటించింది. కనుమ రోజు బుధవారం యథావిధిగా బ్యాంకులు పని చేస్తాయని తొలుత వెల్లడించింది. అయితే, కనుమ రోజు కూడా సెలవు ప్రకటించాలని యునైటెడ్ ఫోరం ఫర్ బ్యాంక్ యూనియన్స్, ఏపీ స్టేట్ యూనియన్ కోరింది. దీనికి సానుకూలంగా స్పందించిన సర్కారు.. కనుమ రోజు కూడా సెలవును పొడిగించింది. దీంతో మంగళ, బుధవారాల్లో బ్యాంకులకు హాలిడే ఉండనుంది. ఈ మేరకు సవరించిన జీవో నెం.73ను విడుదల చేసింది.

## రేవంత్ సర్వే...



హైదరాబాద్, జనవరి 13, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పదేళ్ల తర్వాత గతేడాది అధికారంలోకి వచ్చింది. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అనేక హామీలు హస్తం పార్టీని అధికారంలోకి తెచ్చాయి. 2023, డిసెంబర్ 7న రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. 2024, డిసెంబర్ 7 నాటికి ఏడాది పాలన పూర్తయింది. ఈ ఏడాదిలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన కొన్ని హామీలు నెరవేర్చారు. అనేక హామీలు పెండింగ్‌లోనే ఉన్నాయ. ఈ ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఏడాది పాలనతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డి సర్వే చేయించారు. ఈ సర్వేలో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతోపాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపైనా ప్రజలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. సర్వేలో షాకింగ్ ఫలితాలు వచ్చినట్లు సమాచారం.ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన నేపథ్యంలో తెలంగాణలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, మరో విపక్ష పార్టీ బీజేపీ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు పలు సర్వేలు జరిపినట్లు సమాచారం. నియోజకవర్గాల వారీగా పార్టీల బలాబలాలు, అక్కడి సిటిటంగ్ ఎమ్మెల్యేల పనితీరుపై ఈ సందర్భంగా ఆరా తీసినట్లు తెలిసింది. ఎమ్మెల్యేల గ్రాఫ్ తగ్గిందా? పెరిగిందా? తగ్గితే ఎందుకు తగ్గింది..సిట్టింగ్ ఎమ్మెల్యే గురించి ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఎమ్మెల్యే ప్రజలకు ఏమేరకు అందుబాటులో ఉంటున్నారు. అనే వివరాలు ఆరా తీసినట్లు తెలిసింది. సర్వే రిపోర్టు ఆధారంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడంపై సీఎం దృష్టిపెట్టినట్లు సమాచారం.సీఎం సర్వేలో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోయినట్లు తెలిసింది. ఏడు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ 8 ఎంపీ స్థానాలు గెలిచింది. దీంతో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కమలం పార్టీ అని అంతా భావించారు. కానీ, ఆ పార్టీ నాయకులు ప్రెస్‌మీట్‌లకే పరిమితం అవుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం నిర్వహించిన సర్వేలో బీజేపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోయినట్లు వెల్లడైందని సమాచార.ం ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీ గెలిచిన 8 పార్లమెంట్‌నియోజకవర్గాల్లోనూ చాలా బలహీనంగా ఉందని తెలిసింది. కొన్నిచోట్ల ఆ పార్టీ ఉనికే లేదని ప్రజలు తెలిపినట్లు సమాచారం. ఇక 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలపైనా గతంలో ఉన్న పాజిటివ్ ఇప్పుడు లేదని సర్వేలో గుర్తించినట్లు తెలుస్తోంది.ఇక సర్వేలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై ప్రజాభిప్రాయం సేకరించినట్లు తెలిసింది. ఈ సర్వేలో కేసీఆర్‌పై ఇంకా ప్రజల్లో వ్యతిరేకత తగ్గలేదని సర్వేలో గుర్తించినట్లు సమాచారం. ఇందుకు రెండు ప్రధాన కారణాలను సర్వేలో గుర్తించినట్లు తెలిసింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేకపోవడం, విపక్ష హోదాలో కేసీఆర్ ప్రజలకు దూరంగా ఉండడం కారణంగానే కేసీఆర్‌పై వ్యతిరేకత తొలగనట్లు సమాచారం. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు మినహా మిగతా ఎమ్మెల్యేల పనితీరుపై వ్యతిరేకత ఉన్నట్లు సర్వేలో తేలింది. అధికారంలో లేకపోయినా ఎమ్మెల్యే హంగు ఆర్భాటాలు తగ్గకపోవడం ఇందుకు కారణమని సమాచారం.ఇక అధికార కాంగ్రెస్ పార్టీకి 65 మంది ఎమ్మెల్యేలు ఉండగా, అందులో పది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులపై వ్యతిరేకత ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. నెగెటివ్ జాబితాలో ఉన్న ఇద్దరు మంత్రులపై వ్యతిరేకతకు వారి అనుచరులు, బంధువుల తీరే కారణమని గుర్తించారు. ఇక వ్యతిరేకత ఉన్న పది మంది ఎమ్మెల్యేలో ఇద్దరు సీనియర్లు కూడా ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గాల్లో రియల్ దందాలు, సన్నిహితులు, బంధువుల పెత్తనం ప్రజలు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కొందరు క్యాడర్‌ను పట్టించుకోకపోవడం కూడా వ్యతిరేకతకు కారణంగా తెలుస్తోంది. పనితీరు సరిగా లేని ఎమ్మెల్యేలను విడివిడిగా పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం.ఇక తెలంగాణ సీఎం పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నట్లు భావిస్తున్నారని సర్వేలో తేలింది. ఏడాది పాలనలో ఆయన గ్రాఫ్ పెరిగిందని సర్వేలో వెల్లడైంది. ఆయన పబ్లిక్ మీటింగ్స్‌లో మాట్లాడే భాష తీరు మారడం మంచిదని ప్రజలు భావిస్తున్నట్లు తెలిసింది. రుణమాఫీపై సంతృప్తిగా ఉన్న రైతులు, రైతు భరోసా ఆలస్యం కావడంపై నెగెటివ్‌గా ఉన్నట్లు సమాచారం. ఆసరా పింఛన్ల పెంపు కోసం కూడా ప్రజలు ఎదురు చూస్తున్నట్లు గుర్తించారు.

### రైతు భరోసా గైడ్ లైన్స్ విడుదల
### సాగు భూములకే భరోసా..

హైదరాబాద్, జనవరి 13, తెలంగాణ రైతులు ఏడాదిగా ఎదురు చూస్తున్న రైతు భరోసా అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పరిమితితో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన ప్రతీ ఎకరాకు రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. పంట వేసినా, వేయకపోయినా సాగుభూమి అయితే చాలని స్పష్టం చేసింది. సాగుభూములు కానివాటిని జాబితా తయారు చేయాలని కలెక్టర్లను ఆదేవించింది. మరోవైపు సాగుభూములకు జనవరి 26 నుంచి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎవరెవరు అర్హులు అనే విషయంలో రైతులకు అవగాహన ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు పెట్టుబడిసాయం అందించడం ద్వారా ఉత్పాదకత పెంచడం, ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతోపాటు ఆధునిక పద్ధతులు ఆచరించేందుకు అవసరమైన వనరులు సేకరించడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.ఇక తాజాగా ఉత్తర్వల ప్రకారం.. గ్రామీణాభివృద్ధి, ఆహార భద్రతకు తోడ్పడడంతోపాటు గ్రాంమీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొంది. జనవరి 26 నుంచి రైతు భరోసా పథకం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. భూభారతి ఇప్పటి వరకు ధరణి పోర్టల్‌లో నమోదు అయిన వ్యవసాయ యోగ్యమైన భూ విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతుభరోసా సాయం అందించాలని ఉత్తర్వుల్లు పేర్కొంది. వ్యవసాయ యోగ్యం కాని భూములకు భూములకు ఎలాంటి సాయం ఇవ్వమని స్పష్టం చేసింది.ఇక తాజా ఉత్తర్వుల ప్రకారం సాగు యోగ్యమైన భూములకు, అటవీ హక్కుల చట్టం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు కూడా రైతు భరోసా అందిస్తుంది. రిజర్వు బ్యాంకు నిర్వహించే డీబీటీ పద్ధతిలో రైతుభరోసా సాయం రైతుల ఖతాల్లో జమ చేయాలని ఆదేశించింది. ఎకరాకు(రెండు పంటలకు కలిపి) రూ.12 చొప్పున సాయం అందిస్తామని పేర్కొంది. వ్యవసాయ శాఖ సంచాలకులు రైతుభరోసా పథకం అమలు చేస్తారని ఐటీ భాగస్వామిగా నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్ వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. జనవరి 26 నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపింది. జిల్లాల్లో రైతు భరోసా పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు బాధ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ఊరు వెళ్లిన మహానగరం

హైదరాబాద్, జనవరి 13,తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి ప్రారంభమైంది. ప్రధానంగా ఏపీలో అతి పెద్ద పండుగగా సంక్రాంతికి పేరు ఉంది. ఎక్కడ ఉన్నా.. ఎంత దూరంలో ఉన్నా.. సంక్రాంతి నాడు సొంత గ్రామాన్ని వెతుక్కుని రావడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే సంక్రాంతి సమయాల్లో నగరాలు నిర్మానుష్యంగా మారుతాయి. గ్రామాలు కళకళలాడుతుంటాయి. అయితే ఇప్పుడు ఏపీవ్యాప్తంగా సంక్రాంతి ప్రారంభమైంది. మరోవైపు పిల్లలకు పండగ సెలవులు కూడా ఇచ్చారు. దీంతో ఒక్కొక్కరు స్వగ్రామాలకు వస్తున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఇంకోవైపు శ్రమజీవులు స్వగ్రామాలకు వెళ్లడంతో హైదరాబాద్ నగరం ఖాళీగా కనిపిస్తోంది. చాలా ప్రాంతాలు నిర్మానుష్యం అవుతున్నాయి. ఇక జాతీయ రహదారులపై వాహనాలు పరుగులు పెడుతూ కనిపించాయి. టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి వాహనాలు. అయితే ఈ ప్రయాణాల వేళ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కీలక సూచనలు చేస్తున్నారు. పేరుకే రాష్ట్ర విభజన కానీ హైదరాబాదులో ఉండేది సీమాంధ్రులే. ప్రస్తుతం సంక్రాంతికి వారంతా సొంత గ్రామాలకు రావడంతో హైదరాబాద్ నగరం దాదాపు ఖాళీ అవుతోంది. ఎక్కువమంది సొంత వాహనాల్లో బయలుదేరడంతో హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం అవుతోంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. నల్గొండ జిల్లా కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా మారింది. ప్రధానంగా యాదాద్రి భువనగిరి(జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఏపీ వైపు వస్తున్న మార్గంలోనే వాహనాలు బారులు తీరడం విశేషం.తెలంగాణ ప్రజల సైతం సంక్రాంతిక తమ సొంత గ్రామాలకు వెళ్తున్నారు. దీంతో జూబ్లీ బస్టాండ్ కూడా ప్రయాణికులతో రద్దీగా మారింది. మరోవైపు హైదరాబాదు నుండి ఒక్కరోజులోనే దాదాపు 70 వేల వాహనాలు ఇతర ప్రాంతాలకు వెళ్లాయి. ముఖ్యంగా ఏపీ వైపే వాహనాలు దూసుకెళ్తున్నాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద 16 బూతులకు గాను 10 బూతులు ఏపీ వైపు.. ఆరు బూతులను హైదరాబాద్ వైపు తెరిచి ఉంచారు. నల్గొండ జిల్లా కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద 12 బూతులలో ఏడు ఏపీ వైపు.. ఐదు హైదరాబాదు వైపు తెరిచారు. ప్రయాణాలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు అలర్ట్ చేశారు. రోడ్ల విస్తరణ జరుగుతున్న పరిస్థితి దృష్ట్యా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.మరోవైపు సంక్రాంతి వాహనాల దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 17 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. అక్కడ రోడ్ల మరమ్మత్తు పనులు చేస్తున్నారు. వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని నేషనల్ హైవే అధికారులు సూచిస్తున్నారు. టోల్ ప్లాజా వద్ద మూడు సెకన్ల కంటే ఎక్కువగా వాహనాలు నిలిచిపోకుండా నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫాస్టాగులో ఇబ్బందులు తలెత్తితే వెంటనే హ్యాండ్ మిషన్ గన్నులతో చెల్లింపులు పూర్తి చేసేలా చేస్తున్నారు. మొత్తానికైతే హైదరాబాదు నుంచి ఏపీ వైపు వాహనాలు దూసుకెళ్తుండడంతో.. జాతీయ రహదారి హారన్ల మోతతో హోరెత్తుతోంది.

# చేసిన పాపం... వెంటాడింది

నల్గొండ, జనవరి 13,నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ గంజి కవితపై వేటు.. అక్రమాలు, వసూళ్ల ఆరోపణలతో డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఏడేళ్ల క్రితం నల్గొండ జిల్లాలో డీఎస్పీగా చేరారు గంజి కవిత. ఇప్పటివరకు ఎస్పీగా పనిచేసిన ఆమెపై ఈ మధ్య కాలంలో తీవ్ర స్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న ఆమె..అక్రమాల కోసం తన ఇంటెలిజెన్స్‌ను వాడి.. అడ్డంగా బుక్కయ్యారు. పోలీస్ నిఘా విభాగం జిల్లా ఎస్పీగా పనిచేస్తూ గాడి తప్పిన నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఇంటెలిజెన్స్ విధుల నుంచి తప్పించి డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. రాష్ట్రంలోని కీలకమైన జిల్లాను పర్యవేక్షించే బాధ్యతల్లో ఉన్న ఆమె అడ్డూ అదుపు లేకుండా అక్రమ వసూళ్ల దందా చేయడం వల్లే వేటు వేసినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నమాట.ఏడేళ్ల క్రితం నల్గొండ జిల్లాలో డీఎస్పీగా చేరారు గంజి కవిత. ఇప్పటివరకు ఎస్పీగా పనిచేసిన ఆమెపై ఈ మధ్య కాలంలో తీవ్ర స్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తన సిబ్బందితో పాటు కిందిస్థాయి అధికారుల నుంచి అప్పులు, చేబదుళ్ల తీసుకోవడం.. తిరిగివ్వమంటే ఇంటెలిజెన్స్ నివేదికల పేరుతో బెదిరించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిందట. నాగర్ కర్నూల్ జిల్లా మన్ననూరు దగ్గర ఆమె పెద్ద హోటల్‌ను నిర్మించారని అంటున్నారు. ఆ హోటల్‌కు వంట సరకుల సరఫరాలో సిబ్బందికి ఇండెంట్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన ఇంట్లో జరిగిన వేడుకలకు బహుమతులు తీసుకురావాలంటూ కిందిస్థాయి సిబ్బందికి హుకుం జారీ చేయడం కూడా పోలీస్ అధికారుల్లో వ్యతిరేకత వ్యక్తం అవడానికి కారణమైందట.

ఆమె వసూళ్ల దందాపై సొంత శాఖ సిబ్బందే ఉన్నతాధికారులకు లేఖ రాశారు. కవిత అక్రమాలపై బాధితులు 9 పేజీల లేఖను విడుదల చేశారు. ఇంటెలిజెన్స్ విభాగంలో పోస్టింగ్‌ల కోసం లంచం వసూలు చేసినట్లు ఆరోపించారు. వివిధ సందర్భాల్లో క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం భారీగా వసూళ్లు చేశారట. అంతే కాకుండా సిబ్బందితో అధిక వడ్డీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా చేయించినట్లు లేఖలో తెలిపారు. ఆ లెటర్ ఆధారంగా విచారణ చేపట్టి..15 రోజులుగా కవిత అక్రమాలపై ఫోకస్ పెట్టిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ నిఘా విభాగం.. గంజి కవిత అడ్డగోలు వ్యవహారంపై కొన్ని వివరాలు బయటికి తీసినట్లు ప్రచారం జరుగుతోంది.నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ అధికారిగా గంజి కవిత ఏడేళ్లు పనిచేశారు. ఈ ఏడేళ్లలో ఆమె రేషన్, గుట్కా మాఫియాల నుంచి భారీగా ఆమె వసూళ్లు చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో ఇంటిలిజెన్స్‌లో చేసినవారితో షాడో టీమ్ ఏర్పాటు చేసుకున్న కవిత..ఓ ఏఎస్పీ, ఒక డీఎస్పీ, ఒక సీఐ, పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లతో కవిత ఈ దందా నడిచిపించినట్లు ప్రచారం జరుగుతోంది. కవిత అక్రమాల్లో ఒక ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక హెడ్ కానిస్టేబుల్ పాలు పంచుకున్నట్లు పోలీస్ శాఖలో ఇన్ సైడ్ టాక్. దీంతో ఆమె షాడో టీంపైనా విచారణ కొనసాగుతోందట. సమగ్ర విచారణ తర్వాత కవితను సస్పెండ్ చేయడంతో పాటు ఆమె షాడో టీమ్‌లో ఉన్నవారిపైనా వేటు వేసే యోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.అయితే ప్రాథమిక విచారణలోనే ఎస్పీ కవిత అక్రమాల చిట్టా ఉన్నతాధికారులను నివ్వెర పరుస్తుందట. 7 ఏళ్లుగా జిల్లాలో డీఎస్పీ, ఏఎస్పీ, ఎస్పీ హోదాలో నిఘా విభాగం అధిపతిగా పనిచేసిన ఆమె..సొంత శాఖ సిబ్బందిని కూడా వదలకపోవడం చర్చకు దారి తీసింది. గత ఇంటిలిజెన్స్ చీఫ్ సపోర్ట్ ఉండటంతో జిల్లా ఎస్పీలను కూడా లెక్కచేయకుండా కవిత అక్రమ వసూళ్ల చేసుకుంటూ పోయారని పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పలు సందర్భాల్లో ఆమె స్పెషల్ బ్రాంచ్ నివేదికలకు విరుద్ధంగా ఇంటిలిజెన్స్ నివేదికలు పంపేవారని..కవిత కావాలనే రిపోర్ట్‌లు మార్చి పంపినట్టు అధికారులు నిర్ధారించారట.అందరి మీద నిఘా పెట్టి యాక్షన్ తీసుకోవాల్సిన ఆఫీసర్..సొంత శాఖ సిబ్బంది లేఖతో కార్నర్ అయిపోవడం ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. అంతేకాదు ఆమె ఇంటెలిజెన్స్ విభాగంగా ఎస్పీగా ఉండగానే..రాష్ట్ర ఇంటెలిజెన్స్ టీమ్ కవిత అక్రమాలపై నిఘా పెట్టడం మరింత సినిమాటిక్‌గా మారిందిఈ నేపథ్యంలో ఎస్పీ కవితపై వేటు పడింది. పూర్తిస్థాయి విచారణ తర్వాత ఏం జరగబోతుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఎస్పీ కవిత వరకే చర్యలు ఉంటాయా లేక..ఆమె షాడో టీమ్ చిట్టా కూడా బయటికి తీస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. కవితతో కలిసి అక్రమాలకు పాల్పడిన అధికారులను బదిలీలు, అటాచ్‌మెట్లను సరిపెడుతారా లేక సస్పెండ్ చేస్తారా అన్నది కూడా ఇంట్రెస్టింగ్ పాయింట్‌గా మారింది. చూడాలి మరి ఇంటెలిజెన్స్ ఎస్పీ కవిత నిఘా చిత్రాలు ఇంకేమేం ఉన్నాయో.

# ట్రేడ్ లైసెన్సుల మాఫియా

హైదరాబాద్, జనవరి 13 కంచే చేను మేసిన చందంగా సర్కిళ్లలో అధికారులు ట్రేడ్ లైసెన్స్‌ల వెరిఫికేషన్‌లో పలు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీ ప్రధాన ఆర్థిక వనరుల్లో ఒకటైన ట్రేడ్ లైసెన్సులను వెరిఫికేషన్ చేస్తే కొంత మేరకు ఆదాయం సమకూరుతుందని భావించి కమిషనర్ వెరిఫికేషన్ ఆదేశాలు జారీ చేశారు. అయితే కొందరు అవినీతి అధికారులకు వరంగా మారినట్లు కూడా విమర్శలున్నాయి.జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిల్స్‌లో ఉన్న సుమారు రెండు లక్షల 49 వేల 522 ట్రేడ్ లైసెన్సులను మరోసారి సర్కిళ్ల వారీగా వెరిఫికేషన్ చేయాలని కమిషనర్ జారీ చేసిన ఆదేశాల మేరకు దాదాపు అన్ని సర్కిళ్లలో గడిచిన పదిహేను రోజులుగా వెరిఫికేషన్ కొనసాగుతుంది. అన్ని సర్కిళ్లలోనున్న ట్రేడ్ లైసెన్స్‌లలో అత్యధికంగా 34 వేల 137 ట్రేడ్ లైసెన్స్‌లు గోషామహాల్ సర్కిల్‌లో ఉండగా, అత్యల్పంగా చాంద్రాయణగుట్టలో 2451 ఉన్నట్లు సమాచారం. ఈ ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి కొనసాగుతున్న వ్యాపారాలు తీసుకున్న లైసెన్స్ ప్రకారమే కొనసాగుతున్నాయా? అదనంగా వ్యాపార లావాదేవీలు ఏమైనా జరుగుతున్నాయా? అన్న కోణాల్లో ఈ వెరిఫికేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఏండ్ల కింద తీసుకున్న ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి కొనసాగుతున్న వ్యాపారాలు నేడు ఒకటి నుంచి రెండు, మూడు మలిగీలకు, అంతస్తులకు విస్తరించిన వాటిని తాజాగా అప్ డేట్ చేస్తే కొంత మేరకైనా బల్దియాకు లాభం చేకూరుతుందని అధికారులు భావించగా, స్వామి కార్యం స్వకార్యం అన్న చందంగా కొందరు అధికారులు సర్కిళ్లలో ట్రేడ్ లైసెన్స్‌ల దందాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారస్తుల నుంచి బేరసారాలు కుదుర్చుకుని పాత లైసెన్సుల ఫీజులనే కొనసాగిస్తూ జీహెచ్ఎంసీ ఖజానాకు రావాల్సిన నిధులను దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.ఏళ్ల క్రితం జారీ చేసిన ట్రేడ్ లైసెన్స్‌లను ప్రస్తుత క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుగుణంగా అప్‌డేట్ చేసేందుకు కొందరు కార్పొరేషన్ ఉద్యోగులు నిజాయితీగా విధులు నిర్వహిస్తుండటంతో.. కొందరు డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు అడ్డుపడుతున్నట్లు సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. వ్యాపారస్తుల నుంచి బేరసారాలు కుదుర్చుకుని పాత ట్రేడ్ లైసెన్స్ కొనసాగించేలా డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఈ క్రమంలో అధికారుల అవకతవకలను ప్రశ్నిస్తున్న శానిటరీ జవాన్, లైజనింగ్ ఆఫీసర్లకు కారణం లేకుండానే నోటీసులు జారీ చేసి వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిణామాలు ఇటీవలే ఖైరతాబాద్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో చోటుచేసుకున్నట్లు వినికిడి. ఈ వ్యవహారంపై నోటీసులు స్వీకరించిన కొందరు ఉద్యోగులతో పాటు మరి కొందరు యూనియన్ నేతలు సంక్రాంతి పండుగ తర్వాత కమిషనర్ వద్ద పంచాయతీ పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది

# చైనా మాంజాలపై 107 కేసులు

హైదరాబాద్, జనవరి 13, సంక్రాంతి సంబరాల సంగతి ఏమో కానీ, పతంగులు ఎగురు వేసేందుకు వాడే చైనా మాంజాలతో కు జరిగే ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ నగరంలో జరిగిన ఘటనల నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకున్నారనే చెప్పవచ్చు. ఈ సంక్రాంతికి అటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు సీరియస్ గా చైనా మాంజాలను అరికట్టేందుకు స్పీడ్ పెంచారు.హైదరాబాద్ నగరంలో ఎక్కువగా చైనా మాంజాలను వినియోగించకుండా సంక్రాంతి ముందునుండే పోలీసులు పలుమార్లు హెచ్చరికలు సైతం జారీ చేశారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు అమ్మకాలపై కూడా పోలీసులు ఫోకస్ పెట్టారు. తాజాగా హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ డీసీపీ శ్రీనివాసరావు చైనా మాంజాల విక్రయాలపై మీడియా సమావేశాన్ని నిర్వహించారు.డీసీపీ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలోని ఏడు జోన్ల పరిధిలో చైనా మాంజాల వినియోగానికి సంబంధించి 107 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే విక్రయాలు సాగిస్తున్న 148 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అంతేకాకుండా 7334 బాబిన్స్ చైనా మాంజాలను సీజ్ చేసి, సుమారుగా 90 లక్షల విలువగల మాంజాలను సీజ్ చేశామన్నారు.కొద్ది రోజులుగా నగరంలో తనిఖీలు చేసి వీటి విక్రయాల నిషేధం పై పురోగతి సాధించినట్లు డీసీపీ తెలిపారు. చైనా మాంజాలను అమ్మినా, కొనుగోలు చేసినా వారి సమాచారాన్ని టాస్క్ ఫోర్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఇవ్వాలని, మన సరదా పతంగులాట ఇతరుల ప్రాణాలను తీస్తుందంటూ డీసీపీ హెచ్చరించారు. ఈ కేసులలో పట్టుబడిన వారిపై అనిమల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ నగరంలో పతంగులను ఎగురవేసేవారు విషయాన్ని గమనించి పోలీస్ శాఖ సహకరించాలని ఆయన కోరారు.కాగా నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లిలో చైనా మాంజా తగిలి బాలుడి గొంతు కు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం జరిగింది. గాలిపటం నుండి తెగివచ్చిన దారం, ఆరుబయట ఆడుకుంటున్న బాలుడు గొంతుకు తగలడంతో తీవ్ర గాయమైనట్లు తెలుస్తోంది. వెంటనే స్థానికులు బాలుడిని ప్రవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# పల్లె పోరుకు అంతా రెడీ

వరంగల్, జనవరి 13,రాష్ట్రంలో గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎప్పుడైనా ఉండవచ్చనే సం కేతాలు ఉండటంతో అధికార యంత్రాంగం ముం దస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓటర్ల జాబితాను గ్రామాలు, వా ర్డుల వారీగా సిద్ధం చేయగా, తాజాగా కొత్త పేర్ల ను వార్డుల వారీగా సేకరిస్తున్నారు. గత ఏడాది ఫి బ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. పంచాయతీ పాలకవర్గం గడువు ముగిసి 11 నెలలు పూర్తయినా వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు ఎన్నికలు జరుగలేదు. త్వరలో పంచాయితీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధం గా ఉండేలా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఒకపక్క అధికార యంత్రాంగం స్థానిక సమరానికి సన్నద్ధమవుతుండగా, మరోవైపు పార్టీలు సైతం వ్యూహాలను పదునుపెడుతున్నాయి.

రాబోయే పంచాయతీ ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు ఆయా రాజకీయ పార్టీలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలవారీగా పార్టీ పరిస్థితులను సమీక్షించి అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి పట్టు సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకున్నాయి. పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు జిల్లాలవారీగా ఆయా పార్టీల అగ్రనేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా ఆయా పార్టీల నేతలు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. వీటితోపాటు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్,వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా పార్టీకి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పార్టీల వ్యవహారాలలో ఇప్పటివరకు కొనసాగుతున్న విధానాలను సమీక్షించుకుని అవసరమైన అంశాలలో కొన్ని మార్పులు చేయనున్నట్లు తెలిసింది. ప్రధానంగా మూసపద్ధతికి స్వస్తి పలికి ఆధునిక విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చే విషయంపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.ఆశావహులు స్థానికంగా అందుబాటులో ఉన్న కళాకారులు, పాటల రచయితలతో తమ పేర్లపై పాటలు రాయించుకుంటున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రచార వ్యూహాలపై ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. మంత్రులు జిల్లాల వారీగా బాధ్యత తీసుకుని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని చెప్పారు. అలాగే సిట్టింగ్ ఎంఎల్ఏలు ఉన్నచోట ఒక విధంగా, ప్రతిపక్ష ఎంఎల్ఏలు ఉన్నచోట మరో విధమైన వ్యూహాలు అనుసరించి సాధ్యమైనంత ఎక్కువ స్థానాలు గెలవాలని తెలిపారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే బిఆర్ఎస్ తమ పార్టీ శ్రేణులను స్థానిక సమరానికి సిద్ధం చేస్తున్నది. ఏడాది కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎక్కువ స్థానాలు గెలిచేందుకు బిఆర్ఎస్ అధిష్టానం వ్యూహాలు సిద్ధం చేసుకుంటుంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి.. ఎన్నికల రంగంలోకి దూకేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉన్నారు. సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఔత్సాహికులు తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. గ్రామాల్లో మళ్లీ రాజకీయం ఊపందుకోనుంది. ఒకవైపు ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నాయకులు, యువకులు చొరవ చూపుతున్నారు. గ్రామాలలో మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సంఘాలతో నిత్యం సమావేశమవుతున్నారు. గ్రామంలో ముఖ్య నాయకులు, పెద్దలను కలుస్తూ వారి ఆశీస్సులు పొందే ప్రయత్నం చేస్తున్నారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీకి యువత ఉత్సహం చూపుతోంది. ముఖ్యంగా మొదట జరిగే సర్పంచ్ ఎన్నికలపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఆయా పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలు, ఏ పార్టీలో సభ్యత్వం లేని వారు కూడా ఆయా పార్టీల మద్దతు కూడగట్టి పోటీచేయాలనే ఆసక్తితో ఉన్నారు.

## తిరుమల ఘాట్ లో ప్రమాదం

తిరుమల, జనవరి 13, రుమల తిరుపతిలో వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవలే తొక్కిసలాట ఘటన జరగగా.. ఇప్పుడు ఘాట్ రోడ్డులో ఓ బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 10 మంది గాయపడినట్లు సమాచారం. కాగా.. తిరుమల ఘాట్ రోడ్డు ద్వారా కొండపైకి వెళుతున్న బస్సు.. సోమవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని సమాచారం.పైకి వెళ్లేటప్పుడు సహజంగానే వాహనాలు వేగంగా వెళుతుంటాయి. అలా రెండో ఘాటు రోడ్డు ద్వారా పైకెళ్తున్న ఆర్టీసీ బస్సు.. మలుపు చివరన ఉండే పిట్టగోడను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఇందులో.. 10 మందికి గాయాలు అయ్యినట్లు తెలుస్తోంది.ప్రమాద వివరాలు తెలుసుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని రక్షించి, దగ్గర్లోని ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించారు. అక్కడ వారికి ప్రథమ చికిత్స అందించి, స్విమ్స్ కు తరలించారు. పైకి వెళ్లే మార్గంలోని మలుపులో ప్రమాదం జరగడంతో.. వెనుక వస్తున్న వాహనాలతో దాదాపు 2 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. దాంతో.. కొండ పైకి వెళ్లే మార్గంలో తీవ్ర ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది ట్రాఫిక్ తొలగించే పనుల్లో బిజీగా ఉన్నారు. కాగా.. ఈ ప్రమాదానికి కారణాలపై ఆర్టీసీ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# 120 మంది పిల్లలను దత్తత తీసుకున్నవిష్ణు

తిరుపతి, జనవరి 13, కుడి చేతితో చేసే దానం ఎడమ చేతికి తెలియకూడదు అనుకునే మనస్తత్వం తనది అని, ఇవాళ ఈ విషయం చెప్పడం వెనుక మరో నలుగురు స్ఫూర్తి పొంది మంచి చేసే అవకాశం ఉంది కనుక తాను ఇలా మీడియా ముందుకు వచ్చానని కథానాయకుడు - విద్యావేత్త విష్ణు మంచు తెలిపారు. తిరుపతిలోని 120 మంది అనాథ బాలలను ఆయన దత్తత తీసుకున్నారుతిరుపతిలో మాతృశ్య పేరుతో ఒక అనాథ ఆశ్రమం ఉంది. అక్కడ సుమారు 120 మందికి పైగా బాలలు ఉన్నారు. ఆ ఆశ్రమం నిర్వహణ బాధ్యతలను శ్రీదేవి చూస్తున్నారు. ఒక ప్రయాణంలో ఆవిడకు విష్ణు మంచు తారసపడ్డారు. తమ అనాథ ఆశ్రమంతో గురించి వివరించడంతో పాటు ఏదైనా సహాయం చేయాలని ఆవిడ కోరారుమాతృశ్య అనాథ ఆశ్రమం వివరాలు తెలుసుకున్న విష్ణు మంచు... 120 మందికి పైగా పిల్లల బాధ్యతను తీసుకున్నారు. భోజన, వసతి సదుపాయాలను కల్పించడం మాత్రమే కాదు... అప్పుడప్పుడు వాళ్లకు కొత్త దుస్తులు కొన్ని పంపిస్తున్నారు విష్ణు. మాతృశ్య అనాథ ఆశ్రమంలోని చిన్నారులకు చదువు చెప్పించే బాధ్యతను సైతం తాను తీసుకున్నట్లు విష్ణు మంచు వివరించారు. తిరుపతిలోని విద్యానికేతన్ విద్యా సంస్థలతో పాటు మోహన్ బాబు యూనివర్సిటీ నిర్వాహణ బాధ్యతలు విష్ణు చూస్తున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ సిటీలోనూ ఆయనకు కొన్ని విద్యా సంస్థలు ఉన్నాయి. కథానాయకుడిగా సినిమాలు చేయడం మాత్రమే కాదు... విద్యావేత్తగా రేపటి భావి పౌరులను తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమాన్ని ఆయన చేపట్టారుతండ్రి మోహన్ బాబుతో పాటు విష్ణు కుటుంబం అంతా సంక్రాంతి వేడుకల కోసం చిత్తూరు వెళ్ళింది. మోహన్ బాబు యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన భోగి వేడుకలను మంచు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సినిమాల విషయానికి వస్తే 'కన్నప్ప'తో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్నారు విష్ణు మంచు. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా ప్రేక్షకుల ముందుకు వెళుతున్నారు. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, కాజల్ అగర్వాల్ వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 25 ను ప్రేక్షకుల ముందుకు రానుంది.


# 108 రకాల పిండి వంటలు

మెదక్, జనవరి 13, సంక్రాంతి అంటేనే మనకు గుర్తొచ్చేది కోనసీమ, గోదావరి జిల్లాలు. ఓ వైపు కోడిపందేలు, మరోవైపు ఎడ్ల పోటీలు, ఇప్పుడు కొత్తగా పడవ పోటీలు కూడా చేరాయండోయ్. ఇక మర్యాదల విషయానికొస్తే సాధారణంగానే గోదారి జిల్లాలు ఇలాంటి మర్యాదలకు పెట్టింది పేరు. అందులోనూ కొత్త అల్లుళ్లంటే మామూలుగా ఉండదు. తమ ఇంటి ఆడబిడ్డను చేసుకున్న అల్లుడికి ఆప్యాయత అనురాగాలతో పాటు వందల రకాల పిండివంటలతోనూ విందు భోజనం వడ్డిస్తారు. 'అల్లుడు గారూ కాస్త ఇవి తినిపెడుదురూ..' అంటూ తమదైన మర్యాదలతో వారి ప్రత్యేకతను చాటుకుంటారు.పాలిత ప్రాంతం యానాంకు చెందిన ఓ కొత్త అల్లుడికి అత్తింటి వారు మామూలుగా మర్యాదలు చేయలేదు. ఏకంగా 470 రకాల వంటలను అరిటాకుపై వడ్డించారు. వివరాల్లోకి వెళ్తే.. యానాం వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, వెంకటేశ్వరి దంపతుల ఏకైక కుమార్తె హరిణ్యకు, విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త సాకేత్‌తో గతేడాది వివాహం జరిపించారు. సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుడిని తొలి పండుగకు ఆహ్వానించి ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆశ్చర్యపరిచారు. దాదాపు 470 రకాల వంటలతో వాహ్ అనిపించారు. శాకాహారం, పిండివంటలు, స్వీట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, శీతల పానీయాలు.. ఇలా వందల కొద్దీ వంటలు అరిటాకులపై చిన్న చిన్న కప్పుల్లో ఉంచి వాటిని అందంగా అలంకరించి అల్లుడు, కుమార్తె ఇద్దరినీ విందుకు ఆహ్వానించారు. ఈ మెగా విందును చూసిన కొత్త అల్లుడు సాకేత్ హర్షం వ్యక్తం చేశారు. అత్తారింట్లో అపురూప విందును ఊహించలేదని.. శాకాహారంలో ఇన్ని రకాలు ఉంటాయని ఇప్పుడే చూశానని తెలిపారు.అటు, సంక్రాంతి పండుగకు హైదరాబాద్ వచ్చిన ఓ ఆంధ్రా అల్లుడికి అత్తింటి వారి మర్యాదలు అబ్బురపరిచాయి. పెళ్లైన తర్వాత తొలిసారిగా వచ్చిన అల్లుడికి అత్తమామలు ఏకంగా 130 రకాల వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. కాకినాడకు చెందిన తమ అల్లుడికి తెలంగాణ వంటకాలు రుచి చూపించారు. సరూర్ నగర్ సమీపంలోని శారదానగర్‌లో నివాసం ఉంటున్న క్రాంతి - కల్పన దంపతులకు ఇద్దరు అమ్మాయిలు. పెద్ద కుమార్తెకు కాకినాడకు చెందిన మల్లికార్జున్‌తో 4 నెలల క్రితం వివాహం జరిపించారు. ఈ క్రమంలో సంక్రాంతికి తొలిసారి ఇంటికి అల్లుడు రావడంతో ఆయనకు తెలియకుండా అత్తమామలు సర్ ప్రైజ్ ఇచ్చారు.

# సినిమా



## నోరు జారిన దర్శకుడు



సినిమాలకు హైప్ తేవడానికి స్టేజ్ మీద కొంచెం ఉత్సాహంగా మాట్లాడేస్తుంటారు టీం మెంబర్స్. ఐతే ఆ మాటలు సరదాగా.. చమత్కారంగా ఉంటే ఓకే కానీ.. హద్దులు దాటితేనే ప్రమాదం. సోషల్ మీడియా కాలంలో ప్రతి మాటా ఆచితూచి మాట్లాడాల్సిందే. చిన్న తేడా వచ్చినా పెద్ద కాంట్రవర్సీ అయిపోతుంది. సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా లాంటి సూపర్ హిట్లు అందించిన దర్శకుడు త్రినాథ రావు నక్కిన తాజాగా తన కొత్త చిత్రం మజాకా టీజర్ లాంచ్ కార్యక్రమంలో చేసిన ఒక కామెంట్ తీవ్ర వివాదాస్పదం అవుతోంది. మజాకా చిత్రంలో మన్మథుడు ఫేమ్ అన్షు ఒక కీలక పాత్ర చేసింది. టీజర్లో తన పాత్ర బాగానే హైలైట్ అయింది. ఆమె గురించి త్రినాథరావు మాట్లాడుతూ.. అన్షు ఇప్పుడు ఎలా ఉంది అని ఈవెంట్‌కు హాజరైన అభిమానులను అడుగుతూ.. అలానే ఉందా అన్నాడు. దానికి కొనసాగింపుగా ఆమె సన్నబడింది అని వ్యాఖ్యానించాడు. ఐతే ఈ సినిమాలో పాత్ర చేసేటపుడు ఇలా ఉంటే సరిపోదని బరువు పెరగాలని సూచించినట్లు చెబుతూ ఆయన అభ్యంతరకర వ్యాఖ్య చేశాడు. కొంచెం సన్నబడింది. నేనే కొంచెం తిని పెంచమ్మా తెలుగుకి సరిపోదు. కొంచెం ఎక్కువ సైజుల్లో ఉండాలని చెప్పా. పర్లేదు కొంచెం ఇంప్రూవ్ అయింది. నెక్స్ట్ టైంకి ఇంకా ఇంప్రూవ్ అవుతుంది అని త్రినాథరావు అన్నారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారి తీశాయి. బరువు పెరగాలని అంటే ఓకే కానీ.. సైజులు పెరగాలి అనడం మాత్రం అభ్యంతరకరమే. ఫ్లోలో అన్నారో ఏమో కానీ.. ఈ వ్యాఖ్యలైతే త్రినాథరావుకు తీవ్ర విమర్శలు తెచ్చిపెడుతున్నాయి. ఇదే స్పీచ్‌లో అల్లు అర్జున్‌ను త్రినాథరావు అనుకరించడం కూడా చర్చనీయాంశం అయింది.

## 'మజాకా'.. టీజర్ విడుదల



పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమా 'మజాకా'కి ధమాకా మేకర్ త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మాస్ ఎంటర్టైనర్‌లో రీతు వర్మ హీరోయిన్. ఆదివారం మజాకా హైలీ ఎంటర్‌టైనింగ్ టీజర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. మజాకా ఫిబ్రవరి 21న గ్రాండ్‌గా విడుదల కానుంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. 'ఆడియన్స్ నా నుంచి మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని కోరుకుంటున్నారని వారితో మాట్లాడినప్పుడు తెలిసింది. ముఫ్ఫై సినిమాలు చేయడం అంటే ప్రేక్షకులు ఇచ్చిన వరం. వారు కోరుకున్న సినిమా చేయడం నా బాధ్యత. అలాంటి సమయంలో 'మజాకా' నా దగ్గరకి వచ్చింది. 'మేము వయసుకు వచ్చాం' సినిమా చూసినప్పటినుంచి త్రినాథ్‌తో పనిచేయాలని వుండేది. ఫైనల్‌గా 'మజాకా'తో కుదిరింది. త్రినాథ్, ప్రసన్న చాలా నిజాయతీగా పనిచేస్తారు. ఫ్యామిలీ అంతా కలసి ఎంజాయ్ చేసే సినిమా ఇది' అని అన్నారు. డైరెక్టర్ త్రినాథ్ నక్కిన మాట్లాడుతూ.. "మజాకా నాకు చాలా ఇష్టమైన కథ. సినిమా ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. సందీప్‌తో సినిమా చేయాలని వుండేది. ఈ సినిమా తనతో చేయడం చాలా ఆనందంగా ఉంది'అని పేర్కొన్నారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ.. 'మజాకా కథ వినప్పుడు నాన్‌స్టాప్‌గా రెండు గంటలు నవ్వుకుంటూనే వున్నా. ఈ సినిమాకి ఎవరు కావాలో కథే తీసుకొచ్చింది. మన్మథుడు తర్వాత అన్షు రీలాంచ్ అవుతున్నారు. చాలా మంచి పేరు వస్తుంది. రావు రమేష్ పాత్ర నవ్వించి నవ్వించి ఆడియన్స్ పేపర్లు చించేలా వుంటుంది. సందీప్ కథ వినగానే చేసేద్దామని అన్నారు' అని తెలిపారు. ఈ కార్యక్రమం లో హీరోయిన్ అన్షు, రైటర్ ప్రసన్న, రావు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇక నో హైరానా



ఈ సంక్రాంతికి షెడ్యూల్ అయిన మూడు చిత్రాల్లో బిగ్గెస్ట్ మూవీ.. 400 కోట్లకు పైగా బడ్జెట్లో తెరకెక్కిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య రిలీజైంది. ఐతే ఆ అంచనాలను గేమ్ చేంజర్ పూర్తి స్థాయిలో అందుకోలేకపోయింది. కానీ వసూళ్లయితే బాగానే ఉన్నాయి. తొలి రోజు ఈ సినిమా చూసిన వాళ్లకు పెద్ద అసంతృప్తి ఏంటంటే.. మూవీలో హైలైట్‌గా నిలుస్తుందని భావించిన నానా హైరానా పాట లేకపోవడం. ఆ ఒక్క పాట మీద పది కోట్లకు పైగా ఖర్చు పెట్టింది చిత్ర బృందం. కాస్ట్లీ లొకేషన్లలో, అనేక సాంకేతిక ఆకర్షణలు జోడించి ఈ పాట తీశారు. దీని ప్రోమో చూసి బిగ్ స్క్రీన్ మీద పాట చూడాలని ఆతృతగా ఎదురు చూశారు ప్రేక్షకులు. కానీ ఆ పాట ఏవో సాంకేతిక కారణాల వల్ల సినిమాలో కనిపించలేదు. ఐతే ఇక ఈ పాట సినిమాలో ఉండదేమో అనుకుని నిరాశ పడ్డారు కానీ.. టీం అలెర్ట్ అయి థియేటర్లలోకి ఈ పాటను తీసుకొచ్చేసింది. శనివారం రాత్రి నుంచే కొన్ని థియేటర్లలో నానా హైరానా పాట థియేటర్లలో ప్రదర్శితం అయ్యింది. ఆదివారం పూర్తి స్థాయిలో అన్ని చోట్లా ఈ పాటను యాడ్ చేశారు. విజువల్‌గా ఈ పాట అద్భుతంగా ఉందని.. లొకేషన్లు.. అలాగే కియారా అందాలు హైలైట్ అని అంటున్నారు. సినిమాలో కియారా గ్లామర్ గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆమె కోసం సినిమా చూడొచ్చని తన ఫ్యాన్స్ అంటున్నారు. ఇప్పుడు నానా హైరానా పాట కూడా సినిమాలో కలవడంతో అదొక ఆకర్షణగా మారుతుందనడంలో సందేహం లేదు. తెలుగులో ఇప్పటికే వినయ విధేయ రామ సినిమా చేసినప్పటికీ దాన్ని మించి ఇందులో కియారా హైలైట్ అయింది.

## స్టైలిస్ లుక్‌లో శ్రీలీల

శ్రీలీల తెలుగు సినిమా పరిశ్రమలో కొన్ని రోజుల క్రితం సెన్సేషనల్ హిట్ అయిన "ధమాకా" సినిమాతో ఒక్కసారిగా స్టార్ క్రేజ్ సంపాదించింది. ఈ సినిమా ద్వారా ఆమె ఎంతో అభిమానాలను పొందగలిగింది. కానీ, అటు వెంటనే అనుకోకుండా వరుసగా వచ్చిన ఫ్లాపులతో ఆమె కెరీర్ ఒక దశలో పడిపోయింది. అయితే, ఈ ఫ్లాపుల తర్వాత కూడా శ్రీలీల తన కెరీర్‌ను మరలా పుంజుకునే ప్రయత్నం చేస్తుంది.ప్రస్తుతం, ఆమె నితిన్‌తో "రాబిన్ హుడ్", రవితేజతో "మాస్ జాతర" వంటి సినిమాలతో తిరిగి లైమ్ లైట్‌లోకి రావాలని నిర్ణయించుకుంది. ఈ రెండు సినిమాలూ ఆమె కెరీర్‌లో కొత్త అవకాసాలను తెచ్చే అవకాశం కల్పించాయి. ఈ మధ్య కాలంలో ఆమెకు వచ్చిన కొత్త ఆఫర్లలో మంచి కథలు, పాస్ మార్క్‌తో కూడిన పాత్రలు ఉన్నాయి. అయితే, సినిమాల్లోనే కాదు, ఆమె తన ఫోటోషూట్స్ ద్వారా కూడా సోషల్ మీడియాలో మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది. శ్రీలీలకు చెందిన అత్యుత్తమ ఫోటోషూట్‌లలో ఒకటి ఆమె పింక్ శారీతో చేసిన ఫోటోషూట్. ఈ లుక్ ఆమెను మరింత స్టైలిష్‌గా, ఆకర్షణీయంగా చూపించింది. స్లీవ్‌లెస్ జాకెట్, లూజ్ హెయిర్‌తో, ఆమె చాలా సౌందర్యవంతంగా కనిపిస్తోంది. ఆ ఫోటోలు కుర్రాళ్లను క్లీన్ బౌల్డ్ చేసేలా ఉన్నాయి. ఆమెకు కావాల్సిన ఫోటోషూట్‌లు, స్టైల్ మరింత అనుకూలంగా ఉంటాయి, తద్వారా ఆమె తన కెరీర్‌ను ముందుకు నడిపించుకోవచ్చు.

## అంతా బాగానే ఉంది



నాకు ఎలాంటి సమస్యల్లేవు. అంతా బాగానే ఉంది " అని సినీ హీరో విశాల్ స్పష్టం చేశారు. హీరో విశాల్ ఆరోగ్యంపై ఇటీవల సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరిగిన సంగతి విదితమే. వీటిపై విశాల్ తాజాగా స్పందించారు. శనివారం సాయంత్రం 'మద గజ రాజ' ప్రీమియర్‌కు హాజరై.. తాను ఆరోగ్యంగానే ఉన్నానని ప్రకటించారు. " మా నాన్న అంటే నాకెంతో ఇష్టం. ఆయన వల్లే నేనెంతో ధైర్యంగా ఉన్నా. జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడుతున్నా. ఈ విషయాన్ని ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటే.. మూడు లేదా ఆరు నెలలకొకసారి సినిమాల నుంచి విశ్రాంతి తీసుకుని వెళ్లిపోతున్నానని కొంతమంది అంటున్నారు. ప్రస్తుతం నాకు ఎలాంటి సమస్యల్లేవు. అంతా బాగానే ఉంది. ఇప్పుడు నా చేతులు వణకడం లేదు. మైక్ కూడా కరెక్ట్‌గా పట్టుకోగలుగుతున్నా. ఇటీవల మీరు చూపించిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు. నా తుది శ్వాస వరకూ మీ అభిమానాన్ని మర్చిపోను. గెట్ వెల్ సూన్, కమ్ బ్యాక్ అంటూ మీరు పెట్టిన సందేశాలు కోలుకునేలా చేశాయి " అని విశాల్ తెలిపారు. ఇటీవల జరిగిన ఈవెంట్‌తో పోలిస్తే ఈ ప్రోగ్రాంలో ఆయన ఆరోగ్యంగా, ఫిట్‌గా కనిపించారు. విశాల్ హీరోగా సుందర్.సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మదగజరాజ'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా గత వారం చెన్నైలో చిత్రబఅందం ప్రత్యేక ఈవెంట్ నిర్వహించింది. ఇందులో విశాల్ పాల్గన్నారు. సినిమా గురించి మాట్లాడుతున్న సమయంలో.. ఆయన చేతులు వణికాయి. పూర్తి నీరసంగా కనిపించారు. దీంతో ఈవెంట్‌లో పాల్గన్నవారు కంగారుపడ్డారు. దీనిపై యాంకర్ మాట్లాడుతూ.. విశాల్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని వెల్లడించారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. విశాల్‌కు ఏమైంది ? అంటూ స్థానిక, ఆంగ్ల పత్రికల్లోనూ వార్తలు వచ్చాయి.

## పాన్ ఇండియా స్థాయిలో..

ఓ తెలుగు అమ్మాయికి సినిమాల్లో అవకాశాలు రావడం అంటే.. ఓ పెద్ద అద్భుతం జరిగినట్టే. అందం, అభినయం ఉన్నప్పటికీ తెలుగు అమ్మాయిలను మేకర్స్ పట్టించుకోకపోవడం బాధాకరం. అయితే అవకాశం ఇస్తే పరభాషా హీరోయిన్లకి దీటుగా సత్తా చాటుతామని నిరూపించిన తెలుగు హీరోయిన్లలో వైష్ణవి చైతన్య ఒకరు.షార్ట్ ఫిల్మ్స్ ద్వారా కెరీర్ మొదలుపెట్టిన వైష్ణవి చైతన్యకు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. 'లవ్ ఇన్ 143 అవర్స్, ది సాఫ్ట్‌వేర్ డెవలపర్, అరెరె మానస, మిస్సమ్మ' వంటి తదితర షార్ట్ ఫిల్మ్స్ వైష్ణవి చైతన్యకు పాపులారిటీ తెచ్చిపెట్టాయి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఆ గుర్తింపుని మరింత రెట్టింపు చేసేలా సాయిరాజేష్ దర్శకత్వంలో వచ్చిన 'బేబీ' చిత్రం వైష్ణవి కెరీర్‌ను మలుపు తిప్పింది. ఏమాత్రం అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా బాక్స్‌ఆఫీస్ వద్ద దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను సాధించి చిత్ర పరిశ్రమను సర్‌ప్రైజ్ చేసింది. 'బేబీ' విజయంలో వైష్ణవిదే కీలకపాత్ర. అందుకే ఆమెకు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు దక్కింది. దీంతో వైష్ణవికి అవకాశాలు క్యూకట్టాయి. ప్రస్తుతం ఆమె 'జాక్' సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో ఆమె ముస్లిం అమ్మాయిగా కనిపించనుందని అని మేకర్స్ పోస్టర్ ద్వారా కన్ఫర్మ్ చేశారు. ఈ సినిమాలోనూ ఆమె పాత్ర చాలా కీలకంగా ఉండబోతుంది. 'బేబి'తో వైష్ణవి, 'టిల్లు స్క్వేర్' తో సిద్ధు జొన్నలగడ్డ రూ.100 కోట్ల క్లబ్‌లో చేరి, సూపర్ ఫామ్‌లో ఉన్నారు. దీంతో 'జాక్' పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక తెలుగుతో పాటు తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా వైష్ణవికి అవకాశాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రెండు తమిళ, కన్నడ సినిమాలకు ఆమె సైన్ చేశారు. అలాగే ఇతర భాషల నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ అందాల తార పాన్ ఇండియా కథానాయికగా ఈ ఏడాదిలో మరిన్ని విజయాలను దక్కించుకుంటాననే నమ్మకంతో ఉంది.





# క్రీడలు



## ఈ ఇద్దరు ఆటగాళ్లను ఛాంపియన్స్ ట్రోఫీ నుండి కూడా సైడ్ చేస్తారా?



ఐపీఎల్ 2024లో అద్భుతంగా పునరాగమనం చేసినప్పటి నుంచి రిషబ్ పంత్ టీమ్ ఇండియా తరఫున నిరంతరం ఆడుతున్నాడు. జనవరి 22 నుంచి భారత్- ఇంగ్లండ్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఇంగ్లండ్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కి టీం ఇండియా జట్టును కూడా బీసీసీఐ ప్రకటించింది. ఇందులో ఇద్దరు ఆటగాళ్లను ఎంపిక చేయలేదు. అయితే ఈ ఇద్దరు ఆటగాళ్లను ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి కూడా విస్మరిస్తారా అనే ప్రశ్న అభిమానుల మదిలో మెదులుతోంది. టీమ్ ఇండియా స్పిన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ గాయం కారణంగా చాలా కాలంగా టీమ్ ఇండియాకు దూరమైన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్‌తో స్వదేశంలో ఆడిన టెస్ట్ సిరీస్‌లో కుల్దీప్ వెన్ను గాయానికి గురయ్యాడు. ఆ తర్వాత ఈ బౌలర్ జట్టుకు దూరమయ్యాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో ఈ ఆటగాడు పునరాగమనం చేస్తాడని అభిమానులు ఆశించారు. కానీ అది జరగలేదు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు కుల్దీప్ యాదవ్‌ను టీమిండియా ఎంపిక చేయలేదు. ప్రస్తుతం ఈ బౌలర్ బీజాలో ఉన్నాడు. ఇప్పటివరకు కుల్దీప్ ఫిట్‌నెస్‌పై తాజా అప్‌డేట్ లేదు. వెన్ను గాయం కారణంగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి కూడా కుల్దీప్‌కి టీమ్ ఇండియాలో అవకాశం రాలేదు. ఛాంపియన్స్ ట్రోఫీకి కుల్దీప్ జట్టులోకి వస్తాడా లేదా అనేది చూడాలి. ఐపీఎల్ 2024లో అద్భుతంగా పునరాగమనం చేసినప్పటి నుంచి రిషబ్ పంత్ టీమ్ ఇండియా తరఫున నిరంతరం ఆడుతున్నాడు. ఇటీవల పంత్ ఆస్ట్రేలియాతో ఆడిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కూడా ఆడుతున్నట్లు కనిపించింది. కానీ ఇప్పుడు పంత్‌కు ఇంగ్లాండ్‌తో ు20 సిరీస్‌కు అవకాశం రాలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం కేఎల్ రాహుల్, సంజూ శాంసన్, రిషబ్ పంత్ మధ్య పోటీ జరగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో సెలెక్టర్లు ఏ వికెట్ కీపర్‌ను ఎక్కువగా విశ్వసిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు ఇద్దరు వికెట్‌కీపర్లు సంజూ శాంసన్, ధ్రువ్

## ఛాంపియన్స్ ట్రోఫీ 2025.. కమిన్స్ సారథ్యంలో ఆస్ట్రేలియా జట్టు ప్రకటన




పాకిస్థాన్ వేదికగా జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది. స్టార్ బౌలర్ పాట్ కమిన్స్ నేతృత్వంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టును వెల్లడించింది. శ్రీలంక పర్యటనలో పాల్గొనని కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ మార్ష్‌లకు తుది జట్టులో అవకాశం కల్పించింది. 2023లో భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో, ఇటీవల పాకిస్తాన్‌తో జరిగిన సిరీస్‌లో ఆడిన జట్టులో సీన్ అబాట్ కు మాత్రమే జట్టులో చోటు దక్కలేదు.టీమిండియాతో జరిగిన టెస్టు సిరీస్ లో గాయపడిన కమిన్స్ కోలుకోకపోతే.. అబాట్ ను జట్టులోకి తీసుకునే చాన్స్ ఉంది. ఇక, డేవిడ్ వార్నర్ స్థానంలో ట్రావిస్ హెడ్‌తో కలిసి షార్ట్ ఓపెనర్ గా బరిలో దిగనున్నాడు. జోష్ ఇంగ్లిస్ లేదా అలెక్స్ కారీలలో ఒకరు వికెట్ కీపర్ స్థానాన్ని కైవసం చేసుకుంటారు. కాగా, గ్రూప్ బిలో నాలుగు జట్లలో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికాతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ ఉన్నాయి. తన తొలి మ్యాచ్ లో ఆస్ట్రేలియా ఫిబ్రవరి 22వ తేదీ శనివారం లాహోర్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

ఛాంపియన్స్ ట్రోఫీకి ఆస్ట్రేలియా జట్టు:

పాట్ కమిన్స్(కెప్టెన్), అలెక్స్ కారీ, నాథన్ ఎల్లిస్, ఆరోన్ హార్డీ, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుస్‌చాగ్నే, మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, మాట్ షార్ట్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జాంపా.

## మహిళల యాషెస్ సిరీస్ ఆసీస్ బోణీ

మహిళల యాషెస్ సిరీస్-2025లో ఆస్ట్రేలియా బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా ఇంగ్లండ్‌పై 4 వికెట్ల తేడాతో గెలుపునందుకుంది. ఆష్లే గార్డ్‌నర్ ఆల్‌రౌండ్ షోతో (3/19, 42 నాటౌట్) అదరగొట్టి ఆసీస్‌ను గెలిపించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 43.1 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లు తలో చేయి వేసి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆష్లే గార్డ్‌నర్ మూడు, కిమ్ గార్త్, అన్నాబెల్ సదర్‌ల్యాండ్, అలానా కింగ్ తలో రెండు, డార్సీ బ్రౌన్ ఓ వికెట్ తీశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ హీథర్ నైట్ (39), వ్యాట్ హాడ్జ్ (38), ఆమీ జోన్స్ (31) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. టామీ బేమౌంట్ (13), నాట్ సీవర్ బ్రంట్ (19), సోఫీ ఎక్లెస్టోన్ (16) రెండంకెల స్కోర్లు చేశారు. మయా బౌచియర్ 9, అలైస్ క్యాప్సీ 4, చార్లీ డీన్ 1, లారెన్ బెల్ 1, లారెన్ ఫైలర్ 8 (నాటౌట్) పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 38.5 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్ అలైసా హీలీ (70) ఆసీస్ గెలుపుకు పునాది వేయగా.. ఆష్లే గార్డ్‌నర్ (44 బంతుల్లో 42 నాటౌట్‌బీ 5 ఫోర్లు, సిక్స్) తన జట్టును విజయతీరాలకు చేర్చింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 4, ఎల్లిస్ పెర్రీ 14, బెత్ మూనీ 28, అన్నాబెల్ సదర్‌ల్యాండ్ 10, తహిళ మెక్‌గ్రాత్ 2, అలానా కింగ్ 11 (నాటౌట్) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్, లారెన్ ఫైలర్ తలో రెండు, లారెన్ బెల్, చార్లెట్ డీన్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ గెలుపుతో ఆసీస్ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే మెల్‌బోర్న్ వేదికగా జనవరి 14న జరగనుంది. కాగా, మూడు వన్డేలు, మూడు టీ20లు, ఏకైక టెస్ట్ మ్యాచ్ కోసం ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియాలో పర్యటిస్తుంది. యాషెస్ సిరీస్‌లో భాగంగా ఈ మ్యాచ్‌లన్నీ జరుగనున్నాయి.

## 2025 సీజన్- 2025 మార్చి 23న ప్రారంభం..




ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) 2025 సీజన్‌పై 9రోజులు ఆలస్యంగా ప్రారంభం కానున్నట్లు బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. ముంబయిలోని బిసిసిఐ ప్రధాన కార్యాలయంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ భేటీలో ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ప్రదర్శన, ఐపిఎల్ విషయంలోనూ చర్చ జరిగింది. షెడ్యూల్ ప్రకారం మార్చి 14న ప్రారంభం కావాల్సిన ఐపిఎల్-2025 సీజన్ మార్చి 23 నుంచి ప్రారంభవుతుందని, మే 25న ఫైనల్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్లేఆఫ్, ఫైనల్ మ్యాచ్ తేదీలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కొత్త షెడ్యూల్‌కు సంబంధించిన పనులు త్వరలోనే షురూ కానున్నాయి. ఐపిఎల్ 18వ ఎడిషన్ ప్రారంభంపై చర్చించారు. ఒకే ఎజెండాతో సమావేశం జరిగిందని.. అది కార్యదర్శి నియామకానికి సంబంధించిందేనన్నారు. ఈ సందర్భంగా ఐపీఎల్ కమిషనర్‌ను సైతం ఏడాది కాలానికి నియమించినట్లు తెలిపారు. దాంతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)పై స్పందించారు.

## అయ్యర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



టీమిండియా స్టైలిష్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ఇప్పుడు జోరు మీద ఉన్నాడు. డొమెస్టిక్ క్రికెట్‌లో ఆడిన ప్రతి టోర్నమెంట్‌లోనూ పరుగుల వరద పారిస్తూ పోతున్నాడు. భారత జట్టులో పర్మినెంట్ బెర్త్ సంపాదించడమే టార్గెట్‌గా బ్యాట్‌తో గర్జిస్తున్నాడు. అప్పట్లో దేశవాళీల్లో ఆడనని చెప్పినందుకు బీసీసీఐ అతడి సెంట్రల్ కాంట్రాక్ట్ రద్దు చేయడం, టెస్టులకు దూరమవడంతో కసితో రగిలిపోతున్న అయ్యర్.. తన కోపాన్నంతా బంతి మీద చూపిస్తున్నాడు. కసి తీరా బాదుతూ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. అలాంటోడు తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తానేంటో చూపిస్తానంటూ వాళ్లకు వార్నింగ్ ఇచ్చాడు. గత ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఆడిన అయ్యర్.. ఈసారి పంజాబ్ కింగ్స్ జెర్సీ వేసుకోనున్నాడు. ఇటీవల జరిగిన మెగా ఆక్షన్‌లో అతడ్ని ఏకంగా రూ.26.75 కోట్ల భారీ ధర పెట్టి మరీ కొనుగోలు చేసింది పంజాబ్. అయితే అయ్యర్‌ను కెప్టెన్సీ కోసం తీసుకున్నా అతడికి ఆ పగ్గాలు ఇస్తామని చెప్పలేదు. ఆ విషయాన్ని నాన్చుతూ వచ్చిన పీబీకేఎస్ యాజమాన్యం.. ఎట్టకేలకు ఆదివారం ప్రకటన చేసింది. శ్రేయస్‌ను తమ జట్టు సారథిగా నియమిస్తున్నట్లు పంజాబ్ కింగ్స్ అధికారిక ప్రకటన చేసింది. దీనిపై అయ్యర్ రియాక్ట్ అయ్యాడు. తన మీద ఫ్రాంచైజీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తానని అన్నాడు. 'నా మీద టీమ్ నమ్మకం ఉంచడం గౌరవంగా భావిస్తున్నా. హెడ్ కోచ్ రికీ పాంటింగ్‌తో కలసి మళ్లీ వర్క్ చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని అయ్యర్ చెప్పుకొచ్చాడు. తనను ఇంతగా ఆదరిస్తున్న అభిమానుల రుణం తీర్చుకుంటానని తెలిపాడు. తాను ఏంటో చూపిస్తానని పేర్కొన్నాడు. కాగా, అప్పట్లో పాంటింగ్‌తో కలసి పనిచేశాడు అయ్యర్. 2020లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ హెడ్ కోచ్‌గా ఉన్నాడు. ఆ సమయంలో డీసీకి శ్రేయస్ సారథిగా వ్యవహరించాడు. వీళ్లిద్దరి జోడీ సూపర్ హిట్ అయింది. వీళ్ల ఆధ్వర్యంలో ఢిల్లీ క్యాపిటల్స్ టోర్నీ రన్నరప్‌గా నిలిచింది.

## శతకంతో చెలరేగిన జెమీమా.. భారత్ ఘన విజయం




వన్డేల్లో భారత మహిళల క్రికెట్ జట్టు విజయ దుందుభి కొనసాగిస్తోంది. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ వరుస సిరీస్‌లను గెలుచుకుంటోంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం ఐర్లాండ్‌తో జరిగిన రెండో వన్డేలోనూ విజయం సాధించి, ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా టాప్ ఆర్డర్‌లు స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (102) అద్భుత సెంచరీతో చెలరేగగా.. టాప్ ఆర్డర్‌లో భారత బ్యాటర్లు స్మృతి మంధాన (73), ప్రతిక రావల్ (67), హర్లీన్ డియోల్ (89) సూపర్ ఫాస్ట్ హాఫ్ సెంచరీలతో భారత్‌కు శుభారంభాన్ని అందించారు. దీంతో టీమిండయా 370 పరుగుల భారీ స్కోరు చేయగలిగింది. వన్డేల్లో టీమిండియాకు ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. గతంలో భారత అమ్మాయిలు అత్యధిక స్కోర్ 358/2గా ఉంది. 2017లో ఇదే ఐర్లాండ్ జట్టుపై భారత్ 2 వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. గతేడాది డిసెంబర్‌లోనూ టీమిండియా, విండీస్‌పై కూడా ఇదే స్కోర్ (358/5) నమోదు చేయడం విశేషం. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఐర్లాండ్.. భారత బౌలర్ల ధాటికి విలదొక్కులేక పోయింది. దీంతో ఆ జట్టు 7 వికెట్లు నష్టానికి కేవలం 254 పరుగులు చేసిన ఫలితం లేకుండా పోయింది. కౌల్టర్ (80) మినహా ఎవరూ రాణించలేక పోయారు. దీంతో 116 పరుగుల తేడా భారత్ విజయం సాధించింది. భారత్ బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా.. ప్రియా మిశ్రా 2, సాధు, సయాలి తలో వికెట్ తీశారు.

## జాతరకు ముస్తాబైన శ్రీ రామలింగేశ్వర దేవాలయ ప్రాంగణం..



తూప్రాన్ జనవరి 13 ప్రాజబలం ప్రతినిది :-మెదక్ జిల్ల తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ శివారులోని రామప్ప గుట్ట సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే జాతర ఉత్సవాలకు సిద్ధమైంది.ఆలయ చైర్మన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గుట్టపై వెలిసిన స్వయం భూ రామలింగేశ్వర స్వామి ప్రధాన ఆలయంతో పాటు రామాలయం, గణపతి, నవగ్రహాలు, ఆంజనేయ స్వామి, వాల్మీకం తదితర ఆలయాలను రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పూజారి హనుమాన్ మాల గురుస్వామి శలక ఆత్రేయ శర్మ మాట్లాడుతూ 14, 15, 16, మంగళవారం బుధవారం గురువారాలు సంక్రాంతి పండుగ రోజు నుంచి మొదలుకొని వరుసగా మూడురోజుల పాటు జాతర ఉత్సవాలు జరుగుతాయని మంగళవారం జాతర ఉత్సవాలు బండ్ల ఊరేగింపులతో మొదలై రెండవ రోజు గోపాల గోపాల కల్వల్ గురువారం హెూమం రథోత్సవం కార్యక్రమాలతో ముగుస్తాయి అని తెలిపారు. జాతరకు నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా అన్ని సౌకర్యాలు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి ఆత్రేయ శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , పండితులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## హోటల్లో అగ్ని ప్రమాదం

నెల్లూరు ఉమ్మడి నెల్లూరు జిల్లా తడ మండలం బోడిలింగాలపాడు గ్రామం వద్ద స్మార్ట్ సిటీ హోటల్లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్తో మంటలు చెలరేగాయి. భయంతో హోటల్లో ఉన్న గెస్టులు ఆర్తనాదాలు చేశారు. 2 ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పటానికి ఫైర్ సిబ్బంది ప్రయత్నాలు చేశారు. హోటల్లో ఇరుక్కున్న నలుగురిని సురక్షితంగా ఫైర్ సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. రక్షించిన నలుగురిలో ఇద్దరు కొరియా దేశానికి చెందిన భార్యాభర్తలు ఉన్నారు.

## టీటీడీపై అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటాం.. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరిక

తిరుమల జనవరి 13 తిరుపతిలో ఈ నెల 8వ తేదీన అత్యంత దురదృష్టకరమైన సంఘటన జరిగిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. అలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామి తెలిపారు. బోర్డు సభ్యులతో ఏర్పాటు చేసిన రెండు బృందాలు బాధితులకు పరిహారం అందజేశారని పేర్కొన్నారు.తిరుమలలో సోమవారం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీపై కొన్ని ప్రసార మాధ్యమాలు,సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని అన్నారు. తిరుమల అనేది కోట్లాది మంది హిందువుల మనోభావాలకు సంబంధించిన విషయమని తెలిపారు. వార్త ప్రచురణ, ప్రసారం చేసేటప్పుడు ఒకటికి రెండు సార్లు పరిశీలించాలని కోరారు.

చేతిలో మీడియా ఉందని ఇష్టానుసారం అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.టీటీడీ పాలక మండలికి, అధికారులకు మధ్య విభేదాలు ఉన్నట్లు వస్తున్న వార్తలను బీఆర్ నాయుడు తీవ్రంగా ఖండించారు. అందరూ సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆ సంఘటన మినహా మిగతా అన్ని ఏర్పాట్లు బ్రహ్మాండంగా ఉన్నాయని చెప్పారు. భక్తులు ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటున్నారని తెలిపారు.

## తిరుమలలో మరో అపశృతి

### తిరుమల లడ్డు కౌంటర్లో ,అగ్ని ప్రమాదం



తిరుమల,నిత్యం భక్తులతో కిటకిటలాడే లడ్డు ప్రసాదాలను అందచేసే ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో భక్తులు భయబ్రాంతులకు గురై పరుగులు తీశారు.47 వ నెంబరు కౌంటర్లో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.కంప్యూటర్ సిస్టంకు సంబంధించిన యుపిఎస్ లో షార్ట్ సర్క్యూట్ రావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు.


**CHANGE OF NAME**

I, MOHAMMED MAQBOOL, S/o: **MOHAMMED YUSUFF** (Old Name) has changed my **Father Name** to MOHAMMED MAQBOOL, S/o: **MOHAMMED YOUSUF** (New Name) Occupation: Pvt.Emp, R/o: Plot.No. 1342, Flat No.201, 2nd Floor, Aparanjani Towers, Nizampet, Medchal Malkajgiri Dist. Telangana, vide Affidavit dt: 12.1.2025, Notary Public -Md.Siddiq Ali-Advocate. **Passport No. M7409740,** Medchal Malkajgiri-Dt12.01.2025

**CHANGE OF NAME**

I, **FARZANA BEGUM**, W/o: MOHAMMED MAQBOOL (Old Name) has changed my **Name** to **MOHAMMED FARZANA BEGUM**, W/o: **MOHAMMED MAQBOOL** (New Name) Occu: Housewife, R/o: Plot.No. 1342, Flat No.201, 2nd Floor, Aparanjani Towers, Nizampet, Medchal Malkajgiri Dist. Telangana, vide Affidavit dt: 12/1/2025, Notary Public -Md.Siddiq Ali-Advocate. **Passport No. M7360764,** Medchal Malkajgiri-Dt:12.01.2025


## సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నిక దీక్షతో ఏడు రోజులపాటు నిర్వహింపబడే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు రెండవ నాడైన ఆదివారం రోజు 12.01.2025 శ్రీ స్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.ఉత్సవాలలో భాగంగానే యాగశాల యందు శ్రీచండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోకకల్యాణంకోసం చతుర్వేద పారాయణలు, జపాలు, రుద్రపారాయణ చేయడం జరిగింది.తరువాత మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం కార్యక్రమాలు ఆగమశాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి.అదే విధంగా ఈ సాయంకాలం ప్రదోషకాలపూజలను, హోమాలను జరిపించిన తరువాత జపానుష్ఠానాలు జరిపించబడతాయి.

భృంగివావాన సేవ ఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగా ఆదివారం రోజు సాయంకాలం స్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ జరిపించబడుతుంది.ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకారమండపంలో భృంగివాహనంపై వేంచేపు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడతాయి.

## తిరుమల ఘాట్ రోడ్డు లో ప్రమాదం

### పలువురికి గాయాలు

తిరుమల తిరుమలలో వరుస ప్రమాదాలు భక్తులను కలవరపెడుతున్నాయి. తాజాగా రెండో ఘాట్ రోడ్డులో ఓ బస్సు ప్రమాదానికి గురైంది. డివైడర్ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. బస్సు ప్రమాదంతో అలిపిరి వరకు వాహనాలు నిలిచిపోయాయి. క్రాస్ బారియర్ పటిష్టంగా ఉండటంతో ప్రమాదం తప్పిందని లేదంటే బస్సు లోయలో పడి ఉండేదని భక్తులు చెబుతున్నారు.

## 120 మంది అనాధలను దత్తత తీసుకున్న మంచు విష్ణు

తిరుపతి హీరో మంచు విష్ణు చేసిన ఒక మంచి పనికి అందరూ హ్యాట్సాఫ్ చెపుతున్నారు. తిరుపతిలోని బైరాగిపట్టెడ ప్రాంతంలో ఉండే మాతృశ్య సంస్థకు చెందిన 120 మంది అనాథలను విష్ణు దత్తత తీసుకున్నారు. విద్య, వైద్యంతో పాటు అన్ని విషయాల్లో వీరికి తాను ఒక అన్నగా అండగా ఉంటానని ఈ సందర్భంగా విష్ణు తెలిపారు.ఎలాంటి స్వలాభం లేకుండా మాతృశ్య సంస్థ నిర్వాహకురాలు శ్రీదేవి 120 మంది అనాథలను ఆదరిస్తున్నారని మంచు విష్ణు కొనియాడారు. వారితో పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు అనవసరమైన ఖర్చులను తగ్గించుకుని అనాథలకు సాయం చేయాలని కోరారు.



## సంక్రాంతి పండుగ అందరిలో కొత్త వెలుగులు, ఆనందం నింపాలి

### రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి

ఏలూరు సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ,ప్రజా ప్రతినిధులకు ,అధికారులకు, పాత్రికేయ మిత్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## పండుగ పూటా ప్రజాసేవలోనే

### సంక్రాంతి వేడుకలకు కుటుంబ సమేతంగా సొంతూరుకి సీఎం

### క్షణం తీరిక లేకుండా అభివృద్ధి

### -సంక్షేమ కార్యక్రమాలకు హాజరు

### సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం

### మహిళల స్వయం ఉపాధికి ఈ-ఆటోలు అందజేత

### అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల మానసిక వికాసానికి కేర్ అండ్ గ్రో సంస్థతో ఒప్పందం



నారావారిపల్లె, జనవరి 13 :- సంక్రాంతి పండుగకు కుటుంబ సమేతంగా స్వగ్రామం నారావారిపల్లె వెళ్లిన సీఎం చంద్రబాబు అక్కడా తీరిక లేకుండా ప్రజాసేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. సాధారణ రోజుల్లో పాలన వ్యవహారాల్లో బిజీబిజీగా ఉండే సీఎం చంద్రబాబు పండుగ పూట కూడా ఏమాత్రం విశ్రాంతి లేకుండా గడిపారు. ఉదయం స్థానిక నేతలతో కలిసి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం సొంతగ్రామం నుంచి చంద్రగిరి మండలంలోని వివిధ గ్రామాలకు అవసరమైన రోడ్లు, విద్యుత్ కేంద్రాలు, పాఠశాల భవనాలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. నాణ్యమైన నిత్యవసరాలకై ఒప్పందంమహిళా సంఘాలకు చౌకైన, నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేసేందుకు ఈజీ మార్ట్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఈజీ మార్ట్ ద్వారా పలువురు మహిళలు అవగాహన కలిగేలా ఆన్లైన్లో నిత్యవసర సరుకులు కొనుగోలు చేశారు. మొత్తం ఎన్ని మార్టులు ఉన్నాయని మార్ట్ ప్రతినిధులను సీఎం ప్రశ్నించగా.. ప్రస్తుతానికి కుప్పంలో ఈజీ మార్ట్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, త్వరలో తిరుపతి జిల్లా అంతటా మార్టుల ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 15 మంది మహిళలకు స్వయంఉపాధి నిమిత్తం సబ్సిడీతో ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. ఈ-ఆటోల ద్వారా నెలకు ఆయిల్ రూపంలో రూ.12 వేల వరకూ ఆదా అవుతుందని సీఎంకు అధికారులు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల్లో 100 శాతం శారీరక, మానసిక, ప్రవర్తనా సంసిద్ధత తీసుకొచ్చేందుకు కేర్ అండ్ గ్రో సంస్థతోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నారావారిపల్లె పరిధిలోని 8 అంగన్వాడీ కేంద్రాల్లో దీన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని కుప్పంలో ప్రారంభించగా తల్లులు, అంగన్వాడీ టీచర్లు సంతృప్తిగా ఉన్నారని, చిన్నారులు కూడా యాక్టివ్గా వున్నారని సీఎం అన్నారు.

## నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వేటు

### ఆమె పదవీకాలంలో జరిగిన అక్రమాలపై విచారణకు మంత్రి ఆదేశం

నిజామాబాద్ జనవరి 13 జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమా రాజ్పై ప్రభుత్వం వేటు వేసింది. ప్రభుత్వ ఆసుపత్రిని అడ్డాగా చేసుకొని ఇష్టారాజ్యంగా కార్యకలాపాలు నడపడంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఆమె పదవీకాలంలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించారు.రోగుల అవస్థలను పట్టించుకోకుండా తన చాంబర్ను ఫంక్షన్ హాల్లా మార్చుకొని పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం, సిబ్బంది నుంచి కానుకలు పొందడంపై ప్రభుత్వం సీరియస్గా తీసుకొని ఆమెను బాధ్యతలు నుంచి తప్పించింది. నూతన సూపరింటెండెంట్గా డాక్టర్ శ్రీనివాస్కు బాధ్యతలు అప్పగించింది.

ఏం జరిగిందంటే..?

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన శుక్రవారం రాత్రి ఫంక్షన్హాల్గా మారిపోయిన సంగతి తెలిసిందే. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ తన చాంబర్ను ఫంక్షన్హాల్గా మార్చేశారు. రంగురంగుల అలంకరణలు,బెలూన్లు, ధగధగ మెరిసే లైట్ల మధ్య అట్టహాసంగా తన పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. భారీ కేకు, బొకేలు, బహుమతులు, ఫొటో షూట్లు, వీడియోలు ఇలా ఫంక్షన్హాల్కు ఏమాత్రం తీసిపోకుండా చాంబర్లోవేడుకలు జరిగిపోయాయి. 'యథారాజ.. తథా ప్రజ' అన్నట్టు.. సిబ్బంది కూడా తమ 'మేడమ్'ను ప్రసన్నం చేసుకునేందుకు చాంబర్ను అలంకరించడమే కాకుండా, శుభాకాంక్షలు చెప్పేందుకు క్యూ కట్టారు.మొత్తంగా కొన్ని గంటలపాటు సూపరింటెండెంట్ చాంబర్తోపాటు ఆ పరిసరాలన్నీ ఫంక్షన్ హాల్ను తలపించాయి.ఓ వైపు వేడుకలు జరుగుతుండగా.. శుక్రవారం రాత్రి రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన కేతావత్ బిద్యానాయక్ ఫిట్స్ వచ్చిన భార్యను తీసుకొని దవాఖానకు పరిగెత్తుకొని వచ్చారు. సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో స్ట్రెచ్చర్గానీ, వీల్చైర్గానీ లభించలేదు. దీంతో భార్యను భుజాలపై వేసుకొని లోపలికి వెళ్లాడు. లోపల డాక్టర్లుగానీ, సిబ్బందిగానీ ఎవరూ కనిపించలేదు. అందరూ 'మేడమ్' చాంబర్ వద్దనే ఉన్నారు.

## ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అభినందనలు తెలిపిన ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు





**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 13** జనవరి 2025స్వామి వివేకానంద 162 జయంతి సందర్భముగా నిన్నటి రోజు ఆదివారం 12 జనవరి 2025 న లైట్ అండ్ లైఫ్ యూత్ అసోసియేషన్ వారి ఆద్వర్యంలో జడ్.పీ.హెచ్. స్కూల్ గట్టుప్పల్, నల్లగొండ జిల్లా ఆవరణలో ఉదయం 9 నుండి మొదలుకొని అవసరం మేరకు ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రి వరకు జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడల టోర్నమెంట్లో 16 జట్లు పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మెంటన్ ప్రధాన కార్యదర్శి రమణ, వీరభద్ర రావు, కర్నాటి వెంకటేశ్, డోర్నాల వినయ్ కుమార్, భీమగాని సుభాష్, కొంగరి మల్లికార్జున్, ఇడం విజయ్ కుమార్, నెలాంటి రాజుల నిర్ణయం మేరకు మొదటి స్థానం కరీం నగర్ బాల్ బ్యాడ్మింటన్ కైవసం చేసుకునీ 10116/- ప్రైజ్ మనీ పొందగా, మణికొండ బాల్ బ్యాడ్మింటన్ ద్వితీయ స్థానం కైవసం చేసుకునీ 5116/- ప్రైజ్ మనీ పొందినదని, మూడవ స్థానంలో బీ హెచ్ ఈ ఎల్ బాల్ బ్యాడ్మింటన్ కైవసం చేసుకునీ 3116/- ప్రైజ్ మనీ పొందగా మొత్తం టోర్నమెంట్లో అత్యుత్తమ క్రీడాకారునిగా మణికొండ బాల్ బ్యాడ్మింటన్ నుండి గోపి సాధించడం గర్వకారణంగా ఉన్నదని ముఖ్య సలహాదారుడు అందె లక్ష్మణ్ రావు అభినందనలు తెలియ చేశారు. కలసి కట్టుగా ఘనత సాధించిన కెప్టెన్ గా శ్రీనివాసరావునీ, జట్టు సభ్యులు రమేషు, గోపి, ప్రశాంత్, నవీన్, హసీం, సీతారామరాజు, హరినాద్ రెడ్డి, రామ్ రెడ్డి మరియు శశిధర్ లను ఆటల పోటీలో ప్రస్తుతం సాధించిన విజయానికి అభినందిస్తు ముమ్ముందు ఇంకా ఎన్నో ఘన విజయాలను సాధించాలని ప్రోత్సహించడం జరిగినది.

# మర్రి చెన్నారెడ్డికి ఘనంగానివాళులర్పించిన ఏ సుదర్శన్



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి 106 వ జయంతి సందర్భంగా ఇంద్రాపార్క్ మర్రి చెన్నారెడ్డి ఘాట్ వద్ద వారికి ఘనంగా నివాళులర్పించడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రం ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ కు ఎన్నో మంచి పనులు చేశాడు . ఆ మహనీయుడుకు గుర్తుగా ఈరోజు ఘనంగా నివాళులర్పించడం జరిగింది . ఏ సుదర్శన్ శివసేన ఉద్దవ్ తెలంగాణ రాష్ట్ర ప్రాధనా కార్యదర్శి గౌట్ గణేష్ శివసేన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు హనుమంత్ రావు కృష్ణ పరమేష్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లా అవోపా నూతన పాలక వర్గం




**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ 2024-2026 సం . కాలానికి గాను సోమవారము స్థానిక కృష్ణ నగర్ లోని అవోపా భవన్ లో రాష్ట్ర అవోపా అడ్వైజర్ గంజి స్వరాజ్ బాబు, జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం లు నూతన కార్యవర్గ సభ్యులను నియామక పత్రాలు అందజేశారు. ప్రధాన కార్యదర్శి గా ఈశ్వర ప్రసాద్, కోశాధికారి గా కట్కూరి సుధాకర్, ఉపాధ్యక్షులు గా ఆరుగురు నియమిస్తూ వీరితో పాటు వివిధ కార్యవర్గ సభ్యులను నియమాక పత్రాలు అందజేశారు. ఈనెల 26 న నూతన కార్యవర్గం సభ్యులచే ప్రమాణ స్వీకారం మహోత్సవం ఏర్పాటు చేస్తున్నట్లు, జిల్లా అధ్యక్షులు కొమురవెల్లి వెంకటేశం తెలిపారు.

## పుట్ బాల్ లీగ్ అండర్ -13 లో తృతీయ బహుమతి కైవసం






**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 13:**అస్మిత ఫుట్బాల్ లీగ్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ లోని ఠాగూర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన అండర్ 13 ఫుట్బాల్ పోటీల్లో మందమర్రికి చెందిన లెవన్ స్టార్ టి.కే.అర్ పుట్ బాల్ క్లబ్ క్రీడాకారుల పాల్గొని తృతీయ బహుమతి సాధించినట్లు కోచ్ కరుణాకర్ తెలిపారు. సందర్భంగా అండర్ 13 పోటీల్లో తృతీయ బహుమతి పొందిన క్రీడాకారులను ఫుట్బాల్ సెక్రెటరీ పిన్నింటి రఘునాథరెడ్డి అభినందించారు. విజేతలకు మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్.ఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు లు బహుమతులు అందించారు.

# వేలాల గట్టు మల్లన్న చుట్టూ భక్తుల గిరి ప్రదక్షిణలు





**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 13:**చెన్నూరు నియోజకవర్గంలోని జైపూర్ మండలంలోని వెలాల గ్రామంలో వేలాల గట్టు మల్లన్న గిరి ప్రదక్షిణను సోమవారం భక్త జనుల మధ్య ఘనంగా నిర్వహించారు.

ప్రతినెల ఆరుద్ర నక్షత్రాన నిర్వహించి గిరి ప్రదర్శనను రాజేష్ శర్మ అయోధ్య నుంచి తీసుకువచ్చిన శ్రీరాముని పాదుకలతో ఒగ్గు కళాకారులు భక్తుల కోలాహలంతో అంగరంగ వైభవంగా జరిపారు. సురేష్ ఆత్మ రావు మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదక్షిణ మూడోది కాక శ్రీరాముని పాదుకలతో గుట్ట చుట్టూ భక్తులు తిరిగి ఆలయంలోని మల్లన్న దర్శించుకున్నారు. గిరి ప్రదర్శన కొచ్చే భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల ఆర్టీసీ అధికారులు మంచిర్యాల నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చొప్పకట్ల శ్రీకాంత్, గిరిప్రదక్షిణ కమిటీ సభ్యులు రాజేష్ శర్మ, కర్ణకంటి రవీందర్, యాగ లక్ష్మణ్, దేగ నగేష్ పటేల్, రవీందర్, ఉదయ్ కిరణ్, వేలాల గ్రామాధికారి విద్యాసాగర్, సిపిఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమానికి సన్నాహాక రౌండ్ టేబుల్ సమావేశం

## ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిర



**మెదక్ తూప్రాన్ ప్రజాబలం ప్రతినిధి :-**మెదక్ జిల్ల తూప్రాన్ పట్టణంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి, నాయకులు చెంది శ్రీనివాస్, సర్గాల రాములు ఆధ్వర్యంలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమానికి సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి 7 న నిర్వహించే లక్ష డప్పులు వెయ్యి గొంతులు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లాలో ఉన్న ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 30 సంవత్సరాల నుంచి జరిగే పోరాటంలో అప్పటి నుండి ఇప్పటి వరకు మందకృష్ణ చేసే పోరాటానికి వెంబడే యావత్ తెలంగాణ రాష్ట్ర మాదిగ బిడ్డలు ఉంటారన్నారు.ఇప్పటికైనా సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ చేసే పోరాటానికి వెంబడి ఉంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం కోసం మేము సైతం కార్యక్రమంలో పాల్గొంటామని పలువురు నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు.రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టును తీర్పును స్వాగతిస్తూ భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదిస్తామని శాసనసభ సాక్షిగా సభలో ప్రకటన చేశారు.ఎస్సీ వర్గీకరణ చేయడం కోసం అవసరమైతే స్పెషల్ ఆర్డినెన్స్ తీసుకువచ్చి అయినా సరే ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ చేసి తీరుతామని ముక్తకంఠంగా శాసన సభలో సీఎం చెప్పారు.కానీ ఇప్పటివరకు ఎస్సీ వర్గీకరణ చేయడం కోసం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు చేపడతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగ జాతి బిడ్డలకు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని తెలిపారు.మాదిగ జాతిని మోసం చేస్తే మాదిగలు ఊరుకోరని, ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతోనే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు అనే కార్యక్రమాన్ని ట్యాంక్ బండ్ పై భారీ స్థాయిలో సభ నిర్వహించి, ఎస్సీ వర్గీకరణ సాధించుటకు ఈ సభను వేదికగా చూడాలని తెలంగాణ రాష్ట్ర మాదిగ బిడ్డలు,ఉద్యోగులు విద్యార్థులు, కళాకారులు, మహిళలు,యువకులు,యావత్ మాదిగ జాతి మొత్తం హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు ఊషన్నగారి మురళి, ఎమ్మార్పీఎస్ సీనియర్ జిల్లా నాయకులు,జర్నలిస్టు చంది శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి సర్గల రాములు, తూప్రాన్ మండల అధ్యక్షులు దొంతి స్వామి,మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కన్వీనర్ ముత్తిగళ్ళ ఇమ్మాన్యుయేల్,ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సత్యనారాయణ,ముత్తిగళ్ళ రవి ,చంద్రశేఖర్,సత్యనారాయణ, రామస్వామి,వెంకటేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రజలందరికీ భోగి సంక్రాంతి శుభాకాంక్షలు అదనపు కలెక్టర్ నగేష్.



ఆ మహా శివుని ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో తులతూగాలని మెదక్ జిల్ల అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.

సోమవారం భోగి పండుగ సందర్భంగా మెదక్ మండలం ముద్దాయి కుంట శివాలయాన్ని అదనపు కలెక్టర్ దర్శించుకున్నారు

వేద పండితులు శివలింగం అభిషేకం నిర్వహించి ఆశీర్వచనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఆ పరమశివుని ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని హర హర మహాదేవ శంభో శంకర అనగానే బోలా శంకరుడు ఆ పరమశివుడని భక్తుల కోరిన కోరికలు తీరుస్తాడని పరమశివుని నిత్యం ఆరాధిస్తే మోక్షం సిద్ధిస్తుంది అన్నారు.

# స్వామి వివేకనంద ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారు ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**స్వామి వివేకనంద ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారు.స్వామి వివేకనంద జన్మదినాన్ని జనవరి 12 ను యువజనదినోత్సవంగా భారత దేశమంతా నిర్వహిస్తారు.ఈ కార్యక్రమంలో నేటీ యువకులకు స్వామి వివేకనంద గురించి తెలియజేయడం జరుగుతుంది.ప్రతి యువకుడు స్వామి వివేకనందను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా అన్నారు. స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా గోషామహల్ నియోజకవర్గం గంఫ్రాండ్రి డివిజన్ ఈసమియా బజార్ కమ్యూనిటీ హాల్ వద్ద ఆదివారంనాడు స్వామివివేకనంద యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వి.సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా స్వామి వివేకానంద ఫోటో తోవున్న నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరణ చేయడం జరిగింది.స్వామి వివేకానంద విగ్రహానికి విచ్చేసిన ముఖ్య అతిధులు పూలమాల వేసి నివాళు లర్పించినారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా మరియు కార్యక్రమంలో పాల్గోన్న వారికి శాలువ కప్పి సన్మానించిన స్వామి వివేకానంద యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బి.సతీష్‌గౌడ్. ఈకార్యక్రమంలో పాల్గొన్నవారు మధు సుధన్ చారీ మాజీ స్పీకర్.దయానంద్ గుప్త ఎమ్ ఎల్ సి. బాల లక్ష్మి బీసీ కమిషన్ మెంబెర్. సురేఖ కార్పొరేటర్. మమతా గుప్త మాజీ కార్పొరేటర్.పరమేశ్వరి సింగ్ మాజీ కార్పొరేటర్. నరేందర్ టీపీసీసీ అధికార ప్రతినిధి. నిర్మల్ కుమార్ యాదవ్ ఓబీసీ కన్వీనర్. రాంచేందర్ రాజు మాజీ కార్పొరేటర్.దిలీప్ ఘనటే. బి అర్ ఎస్ నాయకుడు. నందు బిలాల్ కాంటెస్ట్ ఎమ్ ఎల్ ఏ. సంతోష్ గుప్త. విజితా రెడ్డి. టిల్లు యాదవ్.సీనియర్ కాంగ్రెస్ నాయకులు.ప్రజా ఎక్త పార్టీ అధ్యక్షులు. బోనాల శ్రీనివాస్.శైలందర్ యాదవ్. సంజయ్ ఘనటే బి జే పి నాయకులు.బస్తీ పెద్దలు వెంకట్. వెంకట్ రావు. గోవింద్ రాజ్. కైలాష్ జైన్.శ్రీనివాస్ యాదవ్. నరేందర్ యాదవ్ బి అర్ ఎస్ నాయకులు.మరియు సంఘం సభ్యులు. నరేందర్. గణేష్. అశోక్. రవి యాదవ్.లోహిత్. అఖిలేష్ గౌడ్. నవీన్ గౌడ్. చెందు. జైసింహ. అశోక్ యాదవ్. నాగరాజ్ గుప్త.శరత్. బద్రి. శ్రీనివాస్ చారీ.హరి. నర్సింగ్. చేతన్.సాయి వివేక్. సాయి ధనుష్.

## సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలి

### ఏస్ ఏస్ ఏస్ యువ సేన ఆధ్వర్యంలో యువజన దినోత్సవ కార్యక్రమంలో ఉచిత పతంగుల పంపిణీ

### ఎన్ ఎస్ ఎస్ యువసేన వ్యవస్థాపకుడు మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ జనవరి 12:**సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి, వ్యవస్థాపకుడు మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నాచారం వైజయంతి వద్ద ఏస్ ఏస్ ఏస్ యువ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువజన దినోత్సవానికి, ఉచిత పతంగుల పంపిణీ కార్యక్రమానికి సంతోష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పతంగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ పతంగులను ఎగుర వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చైనా మంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా మాంజా తో తలెత్తే అనర్థాల పై అందరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని అన్నారు. చైనా మాంజా వాడకుండా కాటన్ దారం వాడాలని సూచించారు. మంజా దారం సైనికుడి ప్రాణాల్ని తీసిందన్నారు. యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలనీ యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఏ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుంటుక కృష్ణా రెడ్డి, మామిడాల రాజారెడ్డి, రాకేష్, బాలు, గద్ద క్రాంతి కిషోర్, జావీద్ .మధు సూధన్ రెడ్డి మాజీ సైనికుడు ఎస్ఎస్ యువసేన సబ్యులు రమాకాంత్ లోకే, కిషోర్ రెడ్డి, సాయిచంద్, ఆరెళ్ల శ్రీధర్, సురేందర్, మహేష్ రెడ్డి, ఆలేటి శ్రీకాంత్, అక్షంత్, విజయ్, రాజు, కమల్, సెబాస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

## 162వ వివేకానంద స్వామిజయంతి దినోత్సవం

**ప్రజాబలం కొల్చారంమండలం జనవరి 12** కొల్చారం మండలం రంగంపేట గ్రామంలో స్వామి వివేకానంద జయంతి దినోత్సవం సందర్భంగా కొల్చారం మండలం బిజెపి శాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా జరుపుకోబడింది ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఘనపురం హరీష్, కిసాన్ మోర్చా అధ్యక్షులు పల్లె రవికాంత్, ఎస్టి మోర్చా అధ్యక్షులు పూల్ సింగ్ రంగంపేట బూత్ అధ్యక్షులు గంగరాజు మరియు బొద్దుల సాయి ఏనుగండ్ల బూత్ అధ్యక్షులు మంగళ్ లింగం గారు, సంగాయిపేట బూత్ అధ్యక్షులు ఆకుల ఆంజనేయులు గారు,అలాగే మండల సీనియర్ నాయకులు గిరి వెంకట్ వడ్ల భాను చారి మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు




## పైతర ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ను ప్రారంభించిన టిఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి...



**ప్రజా బలం కొల్చారం మండలం జనవరి 12**పైతర ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ను ప్రారంభించిన టిఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డిమెదక్ జిల్లా కొల్చారం మండలం పైతర గ్రామంలో క్రికెట్ పి పి ల్ ప్రీమియర్ లీగ్ సీజన్ టు ను టస్ వేసి ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి గ్రాండ్ పన్సర్ గా నర్సాపూర్ నియోజకవర్గ టిపిసిసి కార్యదర్శి సోమన్న గారి రవీందర్ రెడ్డి నాలుగు జట్లకు లోకల్ బాయ్స్ జట్టుకు ఎలుగారి శ్రీనివాస్ రెడ్డి గల్లీ క్రికెటర్ జట్టుకు నరసింహ రెడ్డి 11 స్టార్ జట్టుకు ఏ ఆదం సూపర్ స్టార్ జట్టుకు ఎల్లేశం టీ షర్ట్స్ పాన్సర్గా అలాగే బ్యాట్స్ స్పాన్సరాలు కుమ్మరి సత్యం మహేశ్వర్ రెడ్డి అలాగే గెలిచిన జట్లకు విన్నర్ కు 20వేల రూపాయలు రన్నర్కు పదివేల రూపాయలు ప్రైస్ మనీ తో పాటు ట్రోఫీలను బీఆర్ఎస్ పార్టీ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి అందజేయనున్నారు.

## కొల్చారం రేణుకా మాత ఆలయంలో చోరీ...



**ప్రజాబలం కొల్చారం మండలం జనవరి 12**మెదక్ జిల్లా మండల కేంద్రం కొల్చారం లోని శ్రీ రేణుకా మాత ఆలయంలో దొంగలు పడి బంగారు నగలు, నగదు ను దోచుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఆలయ మండపంలోకి ప్రవేశించి దొంగ ఎస్-ఎస్ డోర్ ను పగలకొట్టి గుడి ప్రధాన ద్వారం ను ధ్వంసం చేసి హుండీలోని నగదును అమ్మవారి రెండు ముక్కుపుడకలను దోచుకెళ్లారు. కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఎస్ డోర్, తలుపు ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి లోనికి వెళ్లిన దొంగలు మండపంలోని హుండీని ఆలయానికి కొద్ది దూరం వరకు తీసుకెళ్లారు. తాళం పగులగొట్టి అందులోని నగదు దోచుకెళ్లారు. కొల్చారం గౌడ సంఘం సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మమ్మద్ గౌస్ తెలిపారు. క్లూస్ టీం సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. ఆలయంలోని అన్ని సీసీ కెమెరాల లైవ్ ఫుటేజీని పరిశీలించగా ఆలయ మండపంలోని సీసీ కెమెరాల్లో దొంగతనం జరిగిన తీరు రికార్డు అయింది. ఒక వ్యక్తి తలుపు పగలగొట్టి హుండీ తీసుకెళ్తున్న దృశ్యం సీసీ కెమెరాలో స్పష్టంగా నమోదయింది.త్వరలో నే దొంగలను పట్టుకుంటామని ఎస్సై మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు.



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com